మహిమ న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

మహిమ న్యూస్

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగే ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగే ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 197 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, | పేజిలు : 8 | వెల రూ. 2 | శనివారం -17 - అక్టోబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana



విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్.. నారా భువనేశ్వరికి చంద్రబాబు అభినందనలు

- విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ రక్త నిధి కేంద్రం ఏర్పాటును అభినందించిన సీఎం చంద్రబాబు
- సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి బృందానికి ప్రత్యేక అభినందనలు
- తలసేమియా చిన్నారులకు ఉచిత రక్తం అందించడం గొప్ప మానవీయ సేవ అని కొనియాడారు
- విద్యా, వైద్య రంగాల్లో ట్రస్ట్ అందిస్తున్న సేవలను ప్రస్తావించిన ముఖ్యమంత్రి
- ప్రాణ రక్షణే లక్ష్యంగా ట్రస్ట్ ముందుకు సాగాలని ఆకాంక్ష

స్థానిక సమరానికి టీడీపీ సై..
చంద్రబాబు పక్కా వ్యూహం

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించిన టీడీపీ అధిష్ఠానం

- ★సీఎం చంద్రబాబు, లోకేశ్, పల్లా నేతృత్వంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ
- ★క్షేత్రస్థాయి అభిప్రాయాలు, ప్రజామోదం ఆధారంగా వడపోత
- ★మేయర్లు, చైర్మన్ల ప్రత్యక్ష ఎన్నిక నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ
- ★ట్రిపుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటుతో అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యం



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైన నేపథ్యంలో అధికార తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపికపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. కూటమి భాగస్వామ్య పక్షాలతో సీట్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేసిన టీడీపీ అధిష్ఠానం, ఇప్పుడు గెలుపు గుర్రాలను మిగతా 2 లో

జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్



- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జనసేన ప్రచార రథం ప్రారంభం
- 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్'ను జెండా ఊపి ప్రారంభించిన పవన్ కల్యాణ్
- అభ్యర్థి గడల శ్రీనివాసరావు గెలుపునకు పలు సూచనలు
- యువత సమస్యలు తెలుసుకునే వేదికగా ఉండాలని పిలుపు

మద్యం సీసాలు పెట్టి అరెస్ట్ చేశారు.. ఇది పోలీసుల నాటకం: అంబటి రాంబాబు



- స్థానిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను ప్రభుత్వం టార్గెట్ చేస్తోందని అంబటి ఆరోపణ
- దాచేపల్లి అభ్యర్థిని మద్యం కేసులో అక్రమంగా ఇరికించారని విమర్శ
- ఏకగ్రీవాల కోసమే పోలీసులు తప్పుడు కేసులు పెడుతున్నారన్న అంబటి



ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు.. 1,000 టీఎంసీల నీళ్లను వృథాగా దిగువకు వదిలారు: కేటీఆర్

- తెలంగాణలో నీటి ఎద్దడికి కాంగ్రెస్ నిర్లక్ష్యమే కారణమని కేటీఆర్ ఆరోపణ
- 1,000 టీఎంసీల గోదావరి, కృష్ణా జలాలు వృథాగా దిగువకు వెళ్లాయని వ్యాఖ్య
- కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా వినియోగించలేదని విమర్శ
- పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి పంపులు ఆన్ చేయలేదని ఆరోపణ



బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పునకు కాంగ్రెస్ కుట్ర.. రాహుల్‌పై రాజ్‌నాథ్ సంచలన ఆరోపణలు

- భారత్‌లో బంగ్లాదేశ్ తరహా పాలన మార్పునకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని రాజ్‌నాథ్ ఆరోపణ
- ప్రజాస్వామ్యం పేరుతో దేశంలో అరాచకం సృష్టించాలని చూస్తోందని విమర్శ

అమెరికా మంత్రి పర్యటన: జైశంకర్‌పై రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

విదేశాంగ మంత్రి జైశంకర్‌ను 'రూబియో సిబ్బంది' అంటూ పరోక్షంగా వ్యాఖ్యలు

- అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనపై రాహుల్ గాంధీ విమర్శలు
- విదేశాంగ శాఖ అధికారులు గందరగోళంలో ఉన్నారంటూ 'ఎక్స్' వేదికగా పోస్ట్



ఢిల్లీ: అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనకు ముందే రాజకీయ వివాదం నెలకొంది. ఈ పర్యటన నేపథ్యంలో మిగతా 2 లో

జెలెన్‌స్కీ సరైన వ్యక్తి కాదు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై ట్రంప్ తీవ్ర విమర్శలు

- పుతిన్‌తో కంటే జెలెన్‌స్కీతో వ్యవహరించడమే కష్టమన్న ట్రంప్
- ఉక్రెయిన్ ప్రజలు మరో వ్యక్తిని ఎన్నుకుంటే మంచిదని సూచన



ఢిల్లీ: ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జెలెన్‌స్కీ అమెరికాతో మిగతా 2 లో




రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపణ
- పది నెలల్లో మోదీ సర్కార్ పడిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ
- 2029 వరకు మోదీ ప్రధానిగా ఉండాలని ప్రజలు తీర్పు ఇచ్చారని వ్యాఖ్య

హైదరాబాద్: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. మిగతా 2 లో


జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్లతో ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన

తెలంగాణకు మరో దిగ్గజ కంపెనీ.. సీఎం రేవంత్‌తో హ్యుందాయ్ ప్రతినిధుల భేటీ



- ★సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమైన హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ప్రతినిధులు
- ★ఈ కేంద్రం ద్వారా 4,275 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడి
- ★అనుమతులు వేగంగా జారీ చేయాలని అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి రాబోతోంది. ప్రపంచ ప్రసిద్ధ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా, రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్ల వ్యయంతో అత్యాధునిక రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ద్వారా సుమారు 4,275 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు మిగతా 2 లో



ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం: కవిత

- ఖైరతాబాద్ ఉపఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందన్న కవిత
- రేవంత్ పాలన పక్కన పెట్టేశారని విమర్శ
- రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉంటామని వెల్లడి

హైదరాబాద్: తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికపై స్పందించారు. మిగతా 2 లో

మహి న్యూస్
www.mahinewsindia.com
MAHI NEWS
Epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

జెలెన్‌స్కీ సరైన వ్యక్తి కాదు: ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

ఢిల్లీ: ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జెలెన్‌స్కీ అమెరికాతో వ్యవహరించడానికి సరైన వ్యక్తి కాదని, రష్యా అధ్యక్షుడు పుతిన్ కంటే అతనితో చర్చలు జరపడమే కష్టంగా ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ ప్రజలు మరో నాయకుడిని ఎన్నుకుంటే మంచిదని కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా ఆయిల్ రిఫైనరీలపై ఉక్రెయిన్ మళ్ళీ దాడులు ప్రారంభించడంపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులను అవమానకరంగా ఆయన అభివర్ణించారు. శాంతి కావాలని పైకి చెబుతూనే, జెలెన్‌స్కీ యుద్ధాన్ని కొనసాగించాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రపంచానికి ఇంధనం అవసరమైన తరుణంలో రిఫైనరీలపై దాడులు చేయడం సరికాదన్నారు. కొన్ని రోజుల క్రితం ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించిన 'ఇంధన కాల్పుల విరమణ' ఒప్పందాన్ని రష్యా గౌరవించలేదని ఉక్రెయిన్ ఆరోపించింది. విరామ సమయంలోనూ రష్యా తమ ఇంధన వ్యవస్థలపై దాడులు కొనసాగించిందని, అందుకే తాము తిరిగి దాడులు ప్రారంభించాల్సి వచ్చిందని అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. దాడులపై ఉన్న ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు ఆయన తేల్చిచెప్పారు. ఈ పరిణామాల నడుమ, ఉక్రెయిన్ డ్రోన్లు రష్యాలోని రియాజాన్ ప్రాంతంలో ఉన్న ఆయిల్ రిఫైనరీపై దాడి చేయగా, భారీగా మంటలు చెలరేగాయి. మరోవైపు, మధ్య ఉక్రెయిన్‌పై రష్యా జరిపిన డ్రోన్ దాడుల్లో ముగ్గురు పౌరులు మరణించగా, మరో ఆరుగురు గాయపడ్డారు. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మళ్ళీ తారస్థాయికి చేరాయి.

ఎల్‌నినోను ఎదుర్కొనడానికి ప్రజలకు అండగా నిలబడాలి

హైదరాబాద్: ఎల్‌నినో కారణంగా తలెత్తిన సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనడానికి రాష్ట్ర రైతాంగంతో పాటు ప్రతి ఒక్కరూ సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రకృతి ప్రకోపించడంతో తలెత్తిన ఈ విపత్తును ఎదుర్కొనడంలో కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరించాలని కోరారు. ఎల్‌నినో వల్ల ఉత్పన్నమైన పరిస్థితులపై దసరా పండుగ తర్వాత అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరిస్థితి తీవ్రతపై ఆ సమావేశంలో అన్ని పార్టీల సలహాలు, సూచనలు తీసుకుంటామని చెప్పారు. ఆ తర్వాత నవంబర్ మొదటి వారంలో అఖిల పక్ష ప్రతినిధి బృందంతో కలిసి ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి గారిని కలిసి సహకారం కోరుతామని చెప్పారు. ఈ సంక్షోభ కాలం నుంచి గట్టెక్కడానికి తీసుకోవలసిన చర్యలపై ముఖ్యమంత్రి అన్ని శాఖలను అప్రమత్తం చేశారు.ముఖ్యమంత్రి అందుబాటులో ఉన్న మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమావేశమై ఎల్‌నినో ప్రభావం, వర్షాభావం, సాగు, తాగునీటి ఎద్దడి, తద్వారా ఉత్పన్నమయ్యే పరిస్థితులపై సమగ్రంగా సమీక్షించారు. ఎల్‌నినో కారణంగా ఉత్పన్నమయ్యే పరిస్థితులు, తీసుకోవలసిన చర్యలపై ప్రణాళికల గురించి ముఖ్యమంత్రి వివరించి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకుని రైతులు పెద్ద మనసుతో ఎండాకాలం పంటలు వేయడం తగ్గించుకోవాలి. ఒక సీజన్ పంట పండించే పనులను వాయిదా వేసుకొని, ఉన్న నీటిని తాగడానికి వినియోగించుకోవాలి. ఎల్‌నినోను ఎదుర్కొనడానికి ప్రజలకు అండగా నిలబడాలని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నా. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా, తప్పుడు ప్రచారం నమ్మి వరి పంటలు వేస్తే నీరు అందించలేక పంటలు ఎండిపోయి పెట్టుబడి నష్టపోవడమే కాకుండా మోటార్లు, మీటర్లు కాలిపోయే పరిస్థితులు తలెత్తుతాయి. పెద్దమనసుతో ఒక సీజన్‌ను వాయిదా వేసుకోవాలి. రైతులతో పాటు ఈ సంక్షోభ పరిస్థితుల్లో భూమిలేని నిరుపేద కూలీలను ఆదుకోవలసిన అవసరం ఉంది. ఈసారి 2.5 లక్షల మంది ఉపాధి హామీ కూలీ పనులకు వస్తున్నారు. ఉపాధి హామీ పనుల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి గారికి సూచించడం జరిగింది. ప్రస్తుత కాలంలో పంట నష్టపోయిన వారికి, ఎండాకాలంలో వాయిదా వేసుకునే పంట నష్టానికి కూడా కేంద్ర ప్రభుత్వం ప్రకృతి విపత్తుల నిధి నుంచి సహకారం అందించాలి. మార్చి నెలలో ఉండే ఎండలు ఇప్పుడే ఉన్నాయి. 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. రానున్న కాలంలో నీరు, విద్యుత్ విషయంలో తీవ్ర సమస్య ఎదుర్కోబోతున్నాం. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురుస్తాయని, ఆరుతడి పంటలు వేసుకోవాలని వర్షాకాలం ప్రారంభం నుంచి చెబుతూవచ్చాం. గడిచిన 3 సంవత్సరాల్లో సగటున 15 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉండగా, ఈరోజు 20 వేల మెగావాట్లకు చేరుకుంది. 2014-15 నాటికి సగటున 6500 --7,000 మెగావాట్ల వినియోగం ఉండగా, ఈ 13 ఏళ్లలో 14 వేల మెగావాట్ల వినియోగం పెరిగింది. గడిచిన రెండేళ్లలో ఆరేడు వేల వినియోగం పెరిగింది. ఈ పరిస్థితుల్లో కూడా రైతులకు, పరిశ్రమలకు వీలైనంత మేరకు విద్యుత్ అందించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నాం. ఇంకో 15 - 20 రోజుల్లో వర్షాకాలం పంటలు కోతలు అయిపోతాయి. చేతికొచ్చిన పంట ఎండిపోకూడదు. రైతుకు నష్టం, కష్టం రాకూడదు. రైతును ఆదుకోవాలనే ఆలోచనతో.. మార్కెట్‌లో ఎక్కడ, ఏ రేటుకు దొరికినా విద్యుత్‌ను కొనుగోలు చేసి రైతులకు అందించే ప్రయత్నం చేస్తున్నాం. తెలంగాణ మాత్రమే కాకుండా అనేక రాష్ట్రాలు విద్యుత్ కొరతను ఎదుర్కొంటున్నాయి. ఉత్పత్తికన్నా వినియోగం పెరగడంతో విద్యుత్ లభించని పరిస్థితులు తలెత్తాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో రైతులు మనోధైర్యం కోల్పోకుండా ఉండాలని అన్ని రకాలుగా ప్రయత్నాలు చేశాం. చలికాలం ప్రారంభానికి ముందే రిజర్వాయర్లు వట్టిపోయే పరిస్థితులు వచ్చాయి. పోయిన సంవత్సరం ఇదే సమయానికి రిజర్వాయర్లలో 462 టీఎంసీల నీరుండగా, ఇప్పుడు 200 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. అందుబాటులో ఉన్న నీటిని రాబోయే జూన్ వరకు 8 నుంచి 10 నెలలు పొదుపుగా వాడుకోవలసిన అవసరముంది. తాగునీటికే కష్టమైన పరిస్థితులు ఉన్నాయి. రాష్ట్రంలో 24 వేల గ్రామాలకు మంచినీటి సరఫరా చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలోని దాదాపు వంద దేశాల్లో ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా తీవ్రమైన నీటి ఎద్దడి, ఎండ వేడిమితో పాటు రకరకాల సమస్యలు ఉత్పన్నం కాబోతున్నాయని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించారు. ప్రజలు, ముఖ్యంగా రైతాంగం అప్రమత్తంగా ఉండాల్సిన సమయం. ఎల్‌నినో ప్రభావం మొదటగా రైతాంగంపై ప్రభావం చూపనుంది. ముఖ్యంగా సాగునీరు, తాగునీరుతో పాటు విద్యుత్ రంగంపై తీవ్ర ప్రభావం చూపనుంది. తద్వారా పరిశ్రమలు, ప్రజా జీవితం, దినసరి కార్యక్రమాలపైన కూడా తీవ్రమైన ప్రభావం పడనుంది. కనీవినీ ఎరుగని విద్యుత్ వినియోగం జరుగుతోంది. ఉత్పత్తి చేయగలిగిన రాష్ట్రాల నుంచి కేంద్రం సెంట్రల్ పూల్ నుంచి రాష్ట్రానికి సబ్సిడీపై అదనంగా విద్యుత్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. మన అవసరాలకు అనుగుణంగా రాబోయే 10 నెలల వినియోగం ఎంత అవసరమో అంచనా వేసి అందుకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఆశిస్తున్నాం. ఒక విపత్తు సమయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వంతో పాటు రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీ, ఇతర రాజకీయ పార్టీలు, సంఘాలు, మహిళా, విద్యార్థి సంఘాలు సహకరించాలని విజ్ఞప్తి. ఈ ప్రకృతి విపత్తును జయించడానికి అందరి సహకారం కావాలి. ఎల్‌నినో విపత్తుకు సంబంధించి తప్పుడు సమాచారాన్ని ఎవరూ వ్యాప్తి చేయొద్దు. ఎల్‌నినో కారణంగా తలెత్తిన పరిస్థితుల నేపథ్యంలో 24 గంటల పాటు ప్రజలకు సరైన సమాచారం అందించడానికి ప్రత్యేకంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాం. అపోహలు, తప్పుడు ప్రచారం కల్పించకుండా ప్రభుత్వం తరఫున ఎప్పటికప్పుడు సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్‌తో ఒక వార్ రూమ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తూ పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తం చేసుకుంటూ భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తాం. సాగునీరు, తాగునీటిని ఆదా చేసుకోవడం, కూలీలకు పనులు కల్పించడంతో పాటు పశువులకు గ్రాసం, తాగునీరు అవసరాలకు సంబంధించిన అన్ని జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. తీవ్రమైన ఎండల నేపథ్యంలో ఆరోగ్య పరంగా ఏ కష్టమొచ్చిన నిరుపేదలను ఆదుకోవడానికి వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి గారు సవివరంగా తెలిపారు. ఈ విపత్తు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారి నేతృత్వంలో సబ్ కమిటీని నియమించారు. అలాగే ప్రజలకు ఎప్పటికప్పుడు అధికారికంగా సమాచారం అందించడానికి సీఎం సలహాదారు కే. రామకృష్ణ రావు గారిని నోడల్ అధికారిగా నియమించారు.

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి శుక్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారెను వారు సమర్పించారు. ఇంద్రకీలాద్రికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ కార్యనిర్వహణాధికారి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో వారిని అమ్మవారి దర్శనానికి తీసుకువెళ్లారు. గర్భాలయంలో చంద్రబాబు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి పట్టువస్త్రాలను, ఆయన అర్ధాంగి సారెను అమ్మవారికి సమర్పించారు. దర్శనం ముగిసిన అనంతరం, ఆలయ పండితులు ముఖ్యమంత్రి దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి తీర్థప్రసాదాలను, జ్ఞాపికను అందజేశారు. దసరా నవరాత్రుల సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయతీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం..
చర్చలు చివరి దశలో ఉన్నాయన్న నిర్మల!

ఢిల్లీ: భారత్-అమెరికా మధ్య ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే కార్యరూపం దాల్చనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అమెరికాతో జరుగుతున్న చర్చలు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయని ఆమె తెలిపారు. బ్యాంకాక్‌లో నిర్వహిస్తున్న ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల్లో భాగంగా ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి దశ ఇప్పటికే ఖరారైందని, ప్రస్తుతం దీనికి సంబంధించిన న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్ట్) సిద్ధం చేస్తున్నట్లు వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తనకు వివరించారని నిర్మల తెలిపారు. త్వరలోనే ఈ ఒప్పందంపై సంతకాలు జరుగుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వాణిజ్యంతో పాటు, ఇరు దేశాల ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో భారత ఆర్థిక వ్యవస్థ పనితీరుపై కూడా మంత్రి ప్రసంగించారు. అంతర్జాతీయంగా అనేక అనిశ్చితులు నెలకొన్నప్పటికీ, భారత్ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందని పేర్కొన్నారు. కొవిడ్ మహమ్మారి తదుపరి కాలంలో, గత నాలుగైదేళ్లుగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారత్ నిలిచిందని ఆమె గుర్తుచేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న సమ్మిళిత వృద్ధి విధానాలు, నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు, కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ వంటి చర్యల వల్లే ఇది సాధ్యమైందని ఆమె వివరించారు. ప్రజాధనం వినియోగం పట్ల ప్రభుత్వానికి పూర్తి జవాబుదారీతనం ఉందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం: కవిత

హైదరాబాద్: తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికపై స్పందించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని, బలమైన అభ్యర్థిని నిలబెడతామని ఆమె ప్రకటించారు. దసరా రోజున ఒక ఎమ్మెల్సీ అభ్యర్థిని కూడా ప్రకటిస్తామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి రాజకీయాలపైనే దృష్టి సారిస్తున్నారని కవిత ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు కరవుతో అల్లాడుతుంటే, ముఖ్యమంత్రి మాత్రం గోవా, ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉండి క్షేత్రస్థాయిలో పోరాడతామని కవిత స్పష్టం చేశారు. నవంబర్ చివరి వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పనులను వెంటనే పునరుద్ధరించి పూర్తి చేయాలని కోరారు. పారదర్శకత కోసం ఇకపై అన్ని ఎన్నికలను ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్లోబల్ సమ్మిట్‌పై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయకపోతే అడ్డుకుంటామని హెచ్చరించారు.

రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు చప్పుళ్లు"గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది" అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు. "ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్లతో
ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి రాబోతోంది. ప్రపంచ ప్రసిద్ధ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా, రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్ల వ్యయంతో అత్యాధునిక రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ద్వారా సుమారు 4,275 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. శుక్రవారం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ ఎండీ చాంగ్యో చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ భేటీ సందర్భంగా తమ పెట్టుబడి ప్రణాళికలను సీఎంకు వారు వివరించారు. జహీరాబాద్‌లో నెలకొల్పబోయే ఆర్ అండ్ డీ కేంద్రం స్వరూపం, దాని ద్వారా లభించే ఉపాధి కల్పన వివరాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలియజేశారు. హ్యుందాయ్ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వెంటనే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో, తెలంగాణలో కార్ల తయారీ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయాలని హ్యుందాయ్ ప్రతినిధులను ఆయన ఆహ్వానించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూల వాతావరణం ఉందని, ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ భారీ పెట్టుబడితో జహీరాబాద్ ప్రాంతం ఆటోమొబైల్ హబ్‌గా మరింత అభివృద్ధి చెందనుండంటంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్..
నారా భువనేశ్వరికి చంద్రబాబు అభినందనలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలపై ప్రశంసల వర్షం కురిపించారు. విజయవాడలో కొత్తగా ఎన్టీఆర్ ట్రస్ట్ రక్త నిధి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో, ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రక్తం అందక ఏ ఒక్క ప్రాణమూ ప్రమాదంలో పడకూడదనే గొప్ప సంకల్పంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన అర్ధాంగి, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి, ఆమె బృందానికి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. "ఒక్కరి రక్తదానం ఆపదలో ఉన్న మరో కుటుంబానికి జీవన ప్రదాత అవుతుంది. ప్రాణాపాయంలో ఉన్నవారికి పునర్జన్మనిస్తుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా రక్తం అందించాలనే నిర్ణయం గొప్ప మానవీయ సేవ అని ఆయన కొనియాడారు. కేవలం బ్లడ్ బ్యాంక్ మాత్రమే కాకుండా, విద్యా, వైద్యం, మహిళా సాధికారత వంటి ఎన్నో రంగాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను చంద్రబాబు గుర్తుచేశారు. 'సంజీవని మొబైల్ క్లినిక్స్' ద్వారా మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు వైద్య సేవలు చేరవేయడం స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ప్రతి సేవలో మానవత్వం, ప్రతి ప్రయత్నంలో ప్రాణ రక్షణే లక్ష్యంగా ఎన్టీఆర్ ట్రస్ట్ తన సేవలను మరింతగా విస్తరించి, ఎంతో మందికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్

హైదరాబాద్: ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి జనసేన సిద్ధమైంది. ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాదులో ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ గడల శ్రీనివాసరావుకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రచారానికి సంబంధించి ఆయనకు పలు సూచనలు చేశారు. ఈ 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' కేవలం ఎన్నికల ప్రచార వాహనంగానే పరిమితం కాకూడదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేసే ఒక ప్రజాసేవా వేదికగా ఇది కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాదులోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

మద్యం సీసాలు పెట్టి అరెస్ట్ చేశారు.. ఇది పోలీసుల నాటకం: అంబటి రాంబాబు

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులను లక్ష్యంగా చేసుకుని అధికార కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని కుట్రలకు పాల్పడుతోందని వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. దాచేపల్లి నగర పంచాయతీ వైసీపీ అభ్యర్థి కొప్పుల రవికుమార్‌ను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని ఆయన మండిపడ్డారు. తెలంగాణ మద్యం అక్రమంగా నిల్వ ఉంచారనే నెపంతో పోలీసులు సోదాలు చేసి, వారే మద్యం సీసాలు పెట్టి నాటకీయంగా రవికుమార్‌ను అరెస్ట్ చేశారని అంబటి ఆరోపించారు. రవికుమార్ పోటీలో ఉంటే అధికార కూటమికి ఎందుకంత భయమని ఆయన ప్రశ్నించారు. తప్పుడు కేసులు పెట్టి, ఎన్నికలను ఏకగ్రీవం చేసుకోవడానికే ఈ అరెస్ట్ చేశారని విమర్శించారు. రవికుమార్ ఆర్థికంగా బలమైన కుటుంబానికి చెందినవారని, ఆయన తండ్రి సాంబయ్య గతంలో చైర్మన్‌గా పనిచేశారని గుర్తుచేశారు. వైసీపీ అభ్యర్థులను ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తోందని అంబటి మండిపడ్డారు. నామినేషన్లకు అవసరమైన సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇదే ప్రభుత్వం శాశ్వతంగా ఉండదని, పోలీసుల తీరు సరికాదని హెచ్చరించారు. రక్షించాల్సిన వారే భక్షించేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. వెంటనే రవికుమార్‌ను విడుదల చేసి, స్వేచ్ఛగా పోటీ చేసే అవకాశం కల్పించాలని, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

మిథున్ రెడ్డి కాన్వాయ్ పై దాడి ఒక రాక్షస క్రీడ..
ఏపీలో జంగిల్ రాజ్ నడుస్తోంది: జగన్

అమరావతి: రాజంపేట వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిపై పుంగనూరులో దాడి జరిగిందంటూ ఆ పార్టీ అధినేత జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల్లో వ్యతిరేకత పెరగడంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటువంటి దాడులను ప్రోత్సహిస్తూ పాలిస్తున్నారని ఆయన మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేసేందుకు వెళుతున్న వైసీపీ అభ్యర్థులను, నాయకులను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 'జంగిల్ రాజ్' నడుస్తోందని, చంద్రబాబుకు హింస కొత్తేమీ కాదని జగన్ విమర్శించారు. పార్టీ లోక్‌సభాపక్ష నేతకు కూడా రక్షణ కల్పించలేని దుస్థితి నెలకొందన్నారు. ఓటమి భయంతోనే అధికార కూటమి దాడులకు దిగుతోందని, స్వేచ్ఛగా ఎన్నికలు జరిపే ఉద్దేశం వారికి లేదని ఆరోపించారు. కేంద్ర బలగాల పర్యవేక్షణలోనే ఎన్నికలు సజావుగా సాధ్యమవుతాయని జగన్ స్పష్టం చేశారు. మరోవైపు, మిథున్ రెడ్డితో జగన్ ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. పుంగనూరులో మిథున్ రెడ్డి కాన్వాయ్‌ను టీడీపీ కార్యకర్తలు అడ్డుకుని రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారని వైసీపీ వర్గాలు తెలిపాయి. ఈ ఘటనలో పలు వాహ

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

ముదిరాజ్ సంఘం భవనంలో ఘనంగా అమ్మవారి కుంకుమార్చన

- పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్

దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 16వ వార్డులో ఘనంగా అమ్మవారికి కుంకుమార్చన

అమ్మవారి కుంకుమార్చన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ హాజరైనారు







వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పరిగి పురపాలక సంఘం 16వ వార్డులోని ముదిరాజ్ సంఘం భవనంలో మహిళలు ఆధ్వర్యంలో అమ్మవారి కుంకుమార్చన పూజా కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో పరిగి పట్టణ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కుంకుమార్చన కార్యక్రమంలో వార్డుకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని, హారతి పళ్లెములతో అమ్మవారికి హారతులు ఇస్తూ, భక్తి పాటలు పాడుతూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. దుర్గామాత విగ్రహం వద్ద మహిళలంతా సామూహికంగా కుంకుమార్చన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. నవరాత్రులలో అమ్మవారిని పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని, మహిళల ఐక్యతకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని చైర్ పర్సన్ రజిత వెంకటేష్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు మహిళలు, చిన్నారులు, ముదిరాజ్ సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భూముల పంచాయతీలకు చెక్ పెట్టేందుకే రీ సర్వే

- డిప్యూటీ తహసిల్దార్ విజయేందర్



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): నిజాంల కాలంలో 1940-50 మధ్య భూముల సర్వే జరిగిందని, అప్పటి నుండి వరకు భూ సర్వే చేపట్టనందున, ప్రస్తుత ప్రభుత్వం భూ వివాదాలు లేకుండా చేయడానికి పరిగి మండలంలో యాబాజిగూడ బర్మత్ పల్లి, బాబాపూర్, బసిరెడ్డి పల్లి గ్రామాలను భూభారతి లో భాగంగా తీసుకుని, రీ సర్వే కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఇందులో భాగంగా ప్రతి ఊరిలోని గ్రామ కంఠం, వ్యవసాయ పొలాలు, ఇంటి స్థలాలకు సంబంధించిన భూ సర్వే నిర్వహించి హద్దులు నిర్ధారిస్తామని, రైతులు, గ్రామ ప్రజలు అందరూ సహకరించగలరని తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో యాబాజి గూడ గ్రామ సర్పంచ్ నర్సిములు, పరిగి డిప్యూటీ తహసిల్దార్ విజయేందర్, జిపిఓ రాంచందర్, రమేష్, లైసెన్సుడ్ సర్వేయర్ శివ, రైతులు , గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

యూపీ ఎన్నికలపై అఖిలేష్ జోస్యం, ఈసీపై సంచలన వ్యాఖ్యలు




లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి సమాజ్‌వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ బీజేపీ, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)పై పలు తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్ల జాబితాలోని అవకతవకలు, ప్రతిపక్ష ఓటర్ల పేర్లను తొలగించడం, నకిలీ ఓట్లను చేర్చడం వంటి విషయాలపై ఆయన ఎస్పీ కార్యకర్తలను హెచ్చరిస్తూ, అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈసారి ఈ కుంభకోణాన్ని బయటపెడతామని అఖిలేష్ యాదవ్ ప్రకటించారు. పీడీఏ, ముస్లిం-యాదవ్ ఓటర్లు, యువ ఓటర్ల మద్దతుతో ఎస్పీ ఎన్నికల్లో విజయం సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలోని అవకతవకల వల్ల ఒకే వ్యక్తి పేరు మీద ఒకటి కంటే ఎక్కువ ఓట్లు నమోదయ్యాయని యూపీ మాజీ ముఖ్యమంత్రి ఆరోపించారు. ఒక వ్యక్తి ఒక ఓటు వేస్తే, బీజేపీ తొమ్మిది ఓట్లు వేస్తుందంటూ వ్యంగ్యంగా అన్నారు. వికాస్ యాదవ్, శంభు శంకర్ శర్మల పేర్లను ప్రస్తావిస్తూ ఆయన ఓటర్ల జాబితాపై ప్రశ్నలు లేవనెత్తారు. తమ పార్టీ 100 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫిర్యాదులు దాఖలు చేసిందని అఖిలేష్ తెలిపారు. తమ శ్రేణుల ఓట్లను చేర్చేలా చూడాలని, ఎవరి పేరునూ తప్పుగా తొలగించకుండా చూడాలని ఆయన ఎస్పీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈసీఐ ప్రత్యేక పునశ్చరణ శిబిరం సందర్భంగా అక్టోబర్ 17, 24 తేదీలు కీలకమైనవని ఆయన అభివర్ణించారు. బీజేపీ, ఈసీ ఎన్ని పన్నాగాలు పన్నినా పీడీఏ (పిచ్‌డా, దళిత, అల్పసంఖ్యాక), ముస్లిం-యాదవ్ ఓటర్లు, జెన్ జెడ్ వర్గాల కలయికతో ఈ ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని ఆయన తేల్చి చెప్పారు. అలాగే ఈసీకి వ్యతిరేక ఆందోళనల పట్ల కేంద్రం వ్యవహరిస్తున్న తీరును అఖిలేష్ యాదవ్ ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రజలకు ఉందని చెప్పారు. ఢిల్లీలో నిరసనకారులపై దాడి చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న సాధారణ దుస్తుల్లోని వ్యక్తులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. వారు బీజేపీ భావజాలంతో సంబంధం కలిగి ఉన్నందువల్లే అరెస్టు చేయలేదని ఆరోపించారు. సాధారణ ప్రజలపైకి రాజకీయ కార్యకర్తలను ఉసిగొల్పుతున్నారని విమర్శించారు. జర్మనీలో నాజీ హిట్లర్ కూడా ఇలాగే చేసేవాడని పేర్కొన్నారు. దేశానికి బీజేపీయే ఒక సంక్షోభం అని మండిపడ్డారు. ఈ సంక్షోభాన్ని తొలగిస్తేనే దేశం బాగుపడుతుందని మండిపడ్డారు. రాష్ట్రంలో దాదాపు అన్ని వర్గాల ప్రజలు బీజేపీ పాలన పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వ్యాఖ్యానించారు. కాగా ఉత్తరప్రదేశ్‌లో వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు నేపథ్యంలో బీజేపీని ఎలాగైనా గద్దె దించాలని అఖిలేష్ యాదవ్ కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగానే బీజేపీ వ్యతిరేక శక్తులను కూడగట్టి, కూటమిని విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

సీజేపీ నిరసనపై అత్యవసర ఆదేశాలకు 'సుప్రీం' నిరాకరణ

ఢిల్లీ: కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనపై అత్యవసర ఆదేశాలకు సుప్రీంకోర్టు నిరాకరించింది. నేడు కన్నాట్ ప్లేస్ సమీపంలో సీజేపీ నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో నిరసనపై తక్షణ ఆదేశాలు ఇవ్వలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రతి ఒక్కరూ విచక్షణతో మెలగాలని ఆశిస్తున్నామని సీజేఐ అన్నారు. నిరసనలతో చిన్న దుకాణదారుల జీవనోపాధి దెబ్బ తినకూడదన్న సుప్రీం కోర్టు.. వ్యాపారం దెబ్బతింటే రాజ్యాంగ పరిధిలో చర్యలు తీసుకుంటామని జస్టిస్ బాగ్చి అన్నారు. నిరసనలు, శాంతిభద్రతలు, ప్రజల జీవనోపాధి.. అన్నీ పరస్పరం సంబంధం ఉన్న అంశాలుగా పేర్కొన్న జస్టిస్ బాగ్చి.. నష్టంపై అవసరమైతే పరిహారం సహా తగిన న్యాయపరమైన చర్యలు పరిశీలిస్తామన్నారు. సెంట్రల్ పార్క్‌ను మూసివేస్తూ ఎన్‌డీఎంసీ నిర్ణయం తీసుకుందని కోర్టుకు న్యాయవాది తెలిపారు. అక్టోబర్ 26 లేదా 27కు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

నీలేకని సలహాలో చిక్కులు



గత కొన్నేళ్లుగా విద్యార్థుల పాలిట పెను సమస్యగా మారిన ప్రశ్నపత్రాల లీక్‌ను అరికట్టడానికి ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని ఇటీవల చేసిన సూచనపై సహజంగానే విస్తృత చర్చ నడుస్తోంది. ఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రశ్నపత్రం రూపొందిన మరుక్షణం అది ఆర్థిక లబ్ధి కలిగించేదిగా మారుతుందని అభిప్రాయపడ్డారు. దాని బదులు డిజిటల్‌గా ప్రశ్నల నిధి రూపొందించి అవసరమైన సాంకేతికత ద్వారా ఆ నిధినుంచి పరీక్షకు కొన్ని గంటలముందు ప్రశ్నపత్రం రూపొందిస్తే లీక్‌ల సమస్య ఉండదన్నది ఆయన మాట. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకూ, అంతకుముందు దేశవ్యాప్తంగా విద్యార్థుల ఉద్యమానికీ దారితీసిన నీట్, ఇతర పోటీ పరీక్షల తాలూకు ప్రశ్నపత్రాల లీక్‌లను అరికట్టేందుకూ, పరీక్షల సంస్కరణలకూ నీలేకని నేతృత్వాన మొన్న జూలైలో ఉన్నతస్థాయి నిపుణుల కమిటీ ఏర్పాటైంది. ఆ కమిటీ ఇంకా నివేదిక సమర్పించాల్సివుంది. నీలేకని మాత్రమే కాదు... ఇటీవల కేంద్ర విద్యాశాఖకు అనుబంధంగా వుండే పార్లమెంటరీ స్థాయీ సంఘం కూడా ఇలాంటి సూచనే చేసింది. ఒకే మాదిరి ప్రశ్నలు తరచు పునరావృతంచేసే విధానమైనా, నిపుణులతో ప్రశ్నపత్రాల రూపకల్పనైనా పరీక్షకుండే విశ్వసనీయతకు విఘాతం కలిగిస్తున్నదని అభిప్రాయపడింది. ఇందుకు బదులు నేషనల్ టెస్టింగ్ ఏజ న్సీ (ఎన్‌టీఏ) భారీస్థాయిలో, విస్తృతంగా ప్రశ్నల నిధిని ఏర్పాటుచేసుకుని, దాన్ని ఎప్పటికప్పుడు నవీకరించటం వంటి కసరత్తు చేయాలని సూచించింది. డిజిటల్ ఉపకరణాల సాయంతో ప్రశ్నల నిధినుంచి అప్పటికప్పుడు ప్రశ్నపత్రం రూపొందించి, నిపుణులు పరిశీలించాక పరీక్ష కేంద్రాల్లోని కంప్యూటర్లకు విడుదలచేస్తే సరిపోతుందని సంఘం సూచించింది. ఆ నిపుణుల్ని పరీక్ష సమయం పూర్తయ్యేవరకూ బయటికెళ్లకుండా చూస్తే సరిపోతుందని సలహా ఇచ్చింది. ప్రశ్నల నిధి ఏర్పాటుకు సాయంచేసినవారికి సైతం పరీక్షలో అవి వస్తాయో రావో తెలియవు గనుక లీక్ సమస్యే ఉండదని, ప్రశ్నపత్రాల రూపకల్పన, వాటి ముద్రణ, పరీక్ష కేంద్రాలకు పంపిణీ వంటి ప్రక్రియలో ఎక్కడో ఒకచోట లీక్‌లకు ఆస్కారం ఉంటుందన్నది దాని అభిప్రాయం. ఇదంతా వినడానికి బాగానే అనిపిస్తుంది. కాకపోతే బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ, నమ్మకంగా పనిచేసే వ్యక్తులు ఏ స్థాయిలోనూ లేరని నీలేకని అయినా, స్థాయీ సంఘమైనా నిర్ధారణకు రావటం మన అధికార యంత్రాంగం వైఫల్యానికి అద్దం పడుతోంది. అసలు ముద్రణకెళ్లినప్పటినుంచి దాని బాధ్యతలు చూసేవారిలో 'ఎవరో' ఈ స్కాంకు పాల్పడుతున్నారన్న అభిప్రాయం నిజం కాదు. కోట్లాది రూపాయల రాబడి తెచ్చే ఈ లీకుల వెనక మాఫియా ఉంది. వాటితో కోచింగ్ సంస్థల సంబంధాలు, దీనంతటికీ రాజకీయ నేతల అండదండలు రహస్యం కాదు. లేనట్టయితే నిందితులు సులభంగా కేసుల్నించి ఎలా తప్పించుకుంటున్నారు? ప్రభుత్వం అనే అతి పెద్ద వ్యవస్థ గుప్పెడు మాఫియా ముఠాలను అదుపు చేయలేని నిస్సహాయస్థితిలో ఉందంటే... అందుకోసం కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో అప్పటికప్పుడు ప్రశ్నపత్రాల రూపకల్పనే దిక్కని భావిస్తే అది మన పాలనావ్యవస్థ తీరుకు అద్దం పడుతుంది. మనకు దేశవ్యాప్తంగా లక్షన్నర పోటీ పరీక్ష కేంద్రాలున్నాయి. మహానగరాల్లో తప్ప ఎక్కడా ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన ఇంటర్నెట్, విద్యుత్ సరఫరా సహా ఇతర ప్రాథమిక సౌకర్యాలు కూడా లేని వర్తమాన స్థితిలో గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులు కంప్యూటర్ వాడకంలో నైపుణ్యం సాధించగలుగుతారా? అంతంతమాత్రం ఆదాయాలతో బతికే బడుగు వర్గాల కుటుంబాలనుంచి వచ్చే పిల్లలకు ఈనాటికీ కంప్యూటర్లు అందుబాటులో లేవు. ఇలాంటి స్థితిలో పోటీ పరీక్షనాడు కొత్తగా కంప్యూటర్‌తో కుస్తీపట్టడం వారికి సౌకర్యంగా అనిపిస్తుందా? విద్యతోసహా అన్నిచోట్లా తీవ్ర అసమానతలు వర్ధిల్లేచోట మహానగరాల్లో సంపన్నుల పిల్లలు మాత్రమే ఈ పోటీ పరీక్షల్లో విజయం సాధించగలుగుతారు. ఇలాంటి విధానం అమల్లోకి తీసుకురావాలంటే దేశవ్యాప్తంగా మెరుగైన బ్యాండ్‌విడ్త్‌తో అన్ని విద్యాసంస్థలకూ ఇంటర్నెట్, ప్రతి విద్యార్థికీ కంప్యూటర్ సౌకర్యం లభించేలా చూడటం ముఖ్యం. వారికి పటిష్టమైన శిక్షణ అవసరం. ఆ సంగతి కేంద్రం గుర్తించాలి.

నేలతల్లిని కాల్చొద్దు!



వరి పంట చేతికొచ్చే వేళ.. పంట వ్యర్థాల దహనం రైతుల ప్రాణాలను బలిగొంటూ, నేల సారాన్ని హరి స్తోంది. కొయ్యలను కాల్చడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లడమే కాకుండా, భవిష్యత్తులో వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే గాలి నాణ్యత క్షీణిస్తున్న నేపథ్యం లో.. నేలతల్లిని కాపాడుకోవడం, పంట వ్యర్థాల దహనాన్ని నివారించడం మనందరి బాధ్యత. ప్రాణాలను ఇస్తూ, మనను కాపాడుతున్న తల్లి లాంటి నేలను ఇలా అగ్నికి ఆహుతి చేయడం అత్యంత క్షమించరాని నేరం. ఈ నిప్పుల క్రీడ భూమి పొత్తికడుపులో ఉన్న జీవరాశిని, సూక్ష్మ జీవులను క్షణాల్లో బూడిద చేస్తోంది. నేలకు సహజసిద్ధమైన సారాన్ని అందించే సేంద్రియ పదార్థాలు కాలిపోవడంతో భూమి క్రమంగా నిస్సారంగా మారుతుంది. దీనివల్ల భవిష్యత్తులో సాగు ఖర్చు పెరిగి దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది.

భావితరాల భవిత కోసం నేల పరిరక్షణే మార్గం!

రేపు మన పిల్లలకు, భావితరాల కోసం భూసారాన్ని కాపాడుకోవడం అత్యంత కీలకం. నేల ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్తులో నిరంతరం పంటలు పండుతాయి, ప్రజల ఆరోగ్యం నిలకడగా ఉంటుంది. భూమిలో ఉండే జీవ వైవిధ్యం, సూక్ష్మజీవులు, పోషకాలు నాశనమైతే రాబోయే రోజుల్లో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోతుంది. అందువల్ల, నేలతల్లిని కంటికి రెప్పలా కాపాడుకోవడం, పంట వ్యర్థాలను దహనం చేయ కుండా సంరక్షించడం మన అందరి ప్రథమ బాధ్యత. ఉత్తర భారతదేశంలో కొయ్యల దహనం వల్ల ఏ విధంగానైతే ఆకాశం చిమ్మచీకటిలై, విషపూరిత పొగతో ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయో.. ఇప్పుడు అదే పరిస్థితి మన రాష్ట్రంలోనూ పునరావృతమయ్యే ముప్పు ముంచుకొస్తోంది. ఇప్పుడిప్పుడే మన ప్రాంతంలోనూ గాలి నాణ్యత క్రమంగా క్షీణిస్తోంది. ఇదే అజాగ్రత్త కొనసాగితే మన రాష్ట్రాలు కూడా రేపు ఢిల్లీ, పంజాబ్‌లా మారిపోవడంలో ఎలాంటి సందేహం లేదు. పర్యావరణాన్ని కలుషితం చేసే ఈ విష సంస్కృతికి ఇప్పటికైనా స్వస్తి పలకాలి.

పోషకాల కోత.. పెరిగే వ్యయం!

వరి కొయ్యలను కాల్చే క్రమంలో ఇటీవలి కాలంలో తీవ్ర విషాదాలు చోటుచేసుకుంటున్నాయి. పొలంలో అకస్మాత్తుగా ఎగిసిపడే మంటలు, దట్టమైన పొగ కారణంగా ఊపిరి ఆడక, అప్రమత్తంగా లేకపోవడం వల్ల చాలా మంది రైతులు మంటల్లో చిక్కుకుని సజీవ దహనమవుతున్నారు.. క్షణికావేశంలో చేసే ఈ పొరపాటు కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉన్న ప్రాణాలను బలిగొంటోంది. రైతన్నలు ప్రాణాలను పణంగా పెట్టి ఈ ప్రమాదకర విధానాన్ని ఎంచుకోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే వరి కొయ్యలను కాల్చడం వల్ల నేల పై పొరలోని కీలక పోషకాలు పూర్తిగా ఆవిరైపోతాయి. ఒక టన్ను వరి గడ్డి దహనమైతే భూమిలో దాదాపు 5.5 నుండి 6 కిలోల నైట్రోజన్ ఆవిరైపోయి, మొక్కల ఎదుగుదలకు అవసరమైన హరితం లోపిస్తుంది. సుమారు 2.3 కిలోల భాస్వరం నశించిపోవడంతో మొక్కల వేళ్ల వ్యవస్థ బలహీనపడుతుంది. దాదాపు 25 కిలోల పొటాషియం బూడిదై వృథా అవుతుంది. ఇది తెగుళ్లను తట్టు కునే శక్తిని తగ్గిస్తుంది. అలాగే టన్నుల కొద్దీ కార్బన్, గంధకం కాలిపోయి నేల గుల్లబారే గుణాన్ని కోల్పోతుంది.

జరిమానాలు..


బహిరంగ ప్రదేశాల్లో పంట వ్యర్థాలను కాల్చడాన్ని చట్టసభలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986 ప్రకారం ఎన్విరాన్‌మెంటల్ కాంపెన్సేషన్ పేరిట నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ నిబంధనల ప్రకారం భారీ జరిమానాలు విధిస్తున్నారు.. కాలిపోయే భూమి విస్తీర్ణం ఆధారంగా రూ. 5,000 నుండి రూ. 30,000 వరకు ఫైన్లు వసూలు చేస్తారు.

నిబంధనలు ఉల్లంఘించిన రైతుల రెవెన్యూ రికార్డులలో నమోదు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసే అధికారాలు యంత్రాంగానికి ఉన్నాయి.

ప్రత్యామ్నాయ మార్గాలు..

రైతులు కొయ్యలను కాల్చడానికి బదులుగా శాస్త్రీయ పద్ధతులను పాటించాలి. కంబైన్ హార్వెస్టర్ వాడినప్పుడు వచ్చే వ్యర్థాలను భూమిలో కలియదోసేందుకు రోటావేటర్ లేదా కల్టివేటర్లను ఉపయోగించాలి. ఈ కొయ్యలు భూమిలో కుళ్ళిపోయి మేలైన కంపోస్ట్ ఎరువుగా మారుతాయి. డీకంపోజర్ ద్రావణాలను వాడటం ద్వారా కూడా వ్యర్థాలను సులభంగా మట్టిలో కలిపి ప్రాణాలను, నేల తల్లిని రక్షించుకోవాలి.

చట్టం ముందు అందరూ సమానులేనా?



రాజకీయ పలుకుబడి, ఆర్థిక బలం ఉన్న వ్యక్తులపై నమోదైన తీవ్రమైన కేసులు దశాబ్దాల తరబడి విచారణ దశలోనే నిలిచిపోతుంటే సామాన్య ప్రజలకు న్యాయవ్యవస్థపై విశ్వాసం ఎలా నిలుస్తుంది? వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల్లో కొనసాగుతున్న అసాధారణ జాప్యం ఇప్పుడు ఇదే ప్రశ్నను దేశం ముందు ఉంచుతోంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై నమోదైన అక్రమాస్తులు, క్విడ్ ప్రో కో, మనీలాండరింగ్ కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఈడీ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. దాదాపు పదమూడేళ్లుగా ఈ కేసుల్లో విచారణ ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడం ఆందోళనకరం. సీబీఐ ప్రత్యేక కోర్టులో జగన్‌కు సంబంధించిన తొమ్మిది ఛార్జిషీట్ల వ్యవహారాలు పెండింగ్‌లో ఉన్నాయని, డిశ్చార్జ్ పిటిషన్లపై నిర్ణయాలు వెలువడకపోవడం వల్ల తదుపరి విచారణ ముందుకు కదల డం లేదని ఈడీ తన పిటిషన్‌లో పేర్కొనడం గమనార్హం.

ఏళ్ల తరబడి కేసులను పొడిగిస్తే..?

ఇన్నేళ్ల తరువాతైనా ఈడీ విచారణ వేగవంతం కోసం హైకోర్టును ఆశ్రయించడం ఆహ్వానించదగిన పరిణా మం. అయితే కేవలం పిటిషన్ దాఖలు చేయడంతోనే దర్యాప్తు సంస్థల బాధ్యత ముగిసిపోదు.. ఆ కేసుల్లో నిర్దిష్ట ఫలితాన్ని సాధించాలి. కేసుల విచారణకు స్పష్టమైన కాలపరిమితి, కార్యాచరణ ఏర్పడాలి. ఆరోపణలు రుజువైతే శిక్ష పడాలి. నిరాధారమైతే నిందితులకు న్యాయం జరగాలి. కానీ ఏదీ తేలకుండా సంవత్సరాల తరబడి కేసులను కొనసాగించడం అటు ప్రజలకు, ఇటు నిందితులకు కూడా న్యాయం చేసినట్లు కాదు.

ముందే దోషిగా నిర్ధారించకూడదు కానీ..

జగన్ రెడ్డి బెయిలుపై విడుదలై దాదాపు పదమూడేళ్లు గడుస్తున్నా కీలకమైన కేసుల్లో విచారణ పూర్తికాకపోవడం న్యాయప్రక్రియలోని లోపాలను ఎత్తిచూపుతోంది. బెయిల్ పొందడం నిందితుడి చట్టబద్ధమైన హక్కు కావచ్చు.. కానీ బెయిల్ పొందిన తరువాత కేసుల విచారణ అంతులేకుం డా సాగిపోవడం మాత్రం ప్రజల్లో అనేక సందేహాలకు తావి స్తోంది. విచారణకు ముందే ఒక వ్యక్తిని దోషిగా నిర్ధారించకూడదనే న్యాయసూత్రాన్ని గౌరవిస్తూనే, తీవ్రమైన ఆర్థిక నేరాల ఆరోపణలను ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉంచ డాన్ని ప్రశ్నించాల్సిందే. చట్టం కల్పించిన అవకాశాలను వినియోగించుకోవడం ఒక హక్కు. అయితే ఆ అవకాశాలే విచారణను నిరవధికంగా నిలిపివేసే సాధనాలుగా మార కుండా చూడటం న్యాయస్థానాల బాధ్యత.

చట్టం నెమ్మదిగా పనిచేస్తోందా?

జగన్ కేసుల్లో విచారణ ఏకంగా 3041 సార్లు వాయిదా పడిందని ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు గతంలో న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు.. ఆయన దాఖలు చేసిన వ్యాజ్యం నేపథ్యంలో విచారణలో అసాధారణ జాప్యం అంశం సుప్రీంకోర్టు దృష్టికి కూడా వెళ్లింది. ఒక ప్రజాప్రతినిధిపై నమోదైన తీవ్ర మైన ఆర్థిక నేరాల కేసులు ఇంత సుదీర్ఘకాలం తేలకుండా కొనసాగుతుంటే ప్రజలకు ఎలాంటి సంకేతాలు వెళ్తాయి? రాజకీయంగా, ఆర్థికంగా శక్తిమంతులైన వ్యక్తుల విషయం లో చట్టం నెమ్మదిగా పనిచేస్తుందనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడితే అది ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం.

న్యాయస్థానాల ఆచరణలో సమానత్వమేది?

సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు గతంలో అనేక సందర్భాల్లో నొక్కిచెప్పింది. దర్యాప్తు సంస్థలు ఎవరి రాజకీయ ప్రయోజనాలకూ లోబడకుండా పనిచేయాలి. అన్నింటికంటే ముఖ్యంగా, చట్టం ముందు అందరూ సమా నులే అనే రాజ్యాంగ స్ఫూర్తి కేవలం పుస్తకాల్లో కనిపించే ఆదర్శంగా మిగిలిపోకూడదు. అది న్యాయస్థానాల ఆచరణలో ప్రతిబింబించాలి.

విచారణలో వేగం అవసరం!

ఈడీ తాజాగా కోరుతున్న వేగవంతమైన విచారణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. తెలంగాణ హైకోర్టు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి, చట్టపరంగా సాధ్యమైన మేరకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించేలా తగిన ఆదేశాలు ఇవ్వాలి.. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న డిశ్చార్జ్ పిటిషన్లపై ప్రాధాన్య క్రమంలో నిర్ణయాలు వెలువడాలి. ప్రతి పిటిషన్‌పై సహేతుకమైన కారణాలతో ఉత్తర్వులు జారీ చేయాలి. సాధ్యమైన కేసుల్లో రోజువారీ లేదా నిరంతర విచారణ చేపట్టాలి. న్యాయమూర్తుల బదిలీలు, పరిపాలనాపరమైన మార్పులు, దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయ లోపం వంటి కారణాలతో కేసుల పురోగతి నిలిచిపోకుండా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. నిందితులు, దర్యాప్తు అధికారులు, న్యాయవాదులు అందరూ నిర్దేశిత సమయపాలనకు కట్టుబడి ఉండేలా చూడాలి.

ప్రత్యేక హోదా ఉన్నంత మాత్రాన..

జగన్‌కు గతంలో కల్పించిన వ్యక్తిగత హాజరు మినహాయింపుల వంటి అంశాలను కూడా విచారణ అవసరాలు, చట్టపరమైన ప్రమాణాల ఆధారంగా సమీక్షించాలి. ప్రత్యేక హోదా ఉన్నంత మాత్రాన ఎవరికీ ప్రత్యేక న్యాయం ఉండకూడదు. అలాగే రాజకీయ ప్రత్యర్థి అయినంత మాత్రాన ఎవరికీ అన్యాయం జరగకూడదు.. న్యాయం వేగంగా జరగాలి. అంతకంటే ముఖ్యంగా నిష్పక్షపాతంగా జరగాలి. ఇక్కడ ప్రశ్న జగన్ రెడ్డి ఒక్కరి గురించి మాత్రమే కాదు. రేపు మరే రాజకీయ నాయకుడిపై ఇటువంటి ఆరోపణలు వచ్చినా ఇదే ప్రమాణం వర్తించాలి.

చట్టం తన పని తాను చేసుకుపోతోందా?

తెలంగాణ హైకోర్టును ఈడీ ఆశ్రయించిన తాజా పరిణామం మరో సాధారణ న్యాయపరమైన ప్రక్రియగా మిగిలిపోకూడదు.. దశాబ్దానికి పైగా సాగుతున్న ఈ కేసుల విచారణలో ఇది కీలక మలుపు కావాలి. చట్టం తన పని తాను చేసుకుపోతుందనే మాట ప్రజలకు వినిపించడం కాదు.. ఆచరణలో కనిపించాలి. ధనమూ, బలమూ ఉన్నవారికి చట్టం చుట్టం.. సామాన్యుడికి మాత్రం న్యాయం అందని ద్రాక్ష అనే అప ప్రథ మన ప్రజా స్వామ్య చరిత్రలో శాశ్వతంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా చట్టం తన పని తాను చేయాలి! న్యాయానికి ఆలస్యం కాదు.. అంతిమంగా న్యాయమే జరగాలి.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

మూలా నక్షత్ర పర్వదినాన జగన్మాత సన్నిధిలో విద్యా-కళా వైభవం - ఆధ్యాత్మిక శోభతో పులకించిన కళావేదిక



ఇంద్రకీలాద్రి, మహి న్యూస్, అక్టోబర్ 16: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవోపేతంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో అత్యంత విశేషమైన మూలా నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ కనకదుర్గా నగర్‌లోని కళావేదికపై శుక్రవారం సాంస్కృతిక, ఆధ్యాత్మిక శోభ పరిపూర్ణంగా వికసించింది. శ్రీ కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రమైన పవిత్ర మూలా నక్షత్రం వేళ, జగజ్జనని ఇంద్రకీలాద్రి శిఖరాన శ్వేతవస్త్రధారిణియై, చేతిలో వీణ, పుస్తకం, జపమాల ధరించి సమస్త సృష్టికి జ్ఞానాన్ని, విద్యాబుద్ధులను ప్రసాదించే శ్రీ సరస్వతీ దేవి దివ్యాలంకారంలో భక్తులకు కటాక్షం ప్రసాదిస్తున్నారు. “సంగీతమపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయం” అన్నట్లుగా.. సాక్షాత్తు చదువుల తల్లికి, కళల అధిదేవతకు అంకితమిస్తూ కళాకారులు సమర్పించిన సంగీత, సాహిత్య, నాట్య నివేదనలు ప్రాంగణమంతటా భక్తి చైతన్యాన్ని రగిలించాయి. ఉదయం నుండి రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగిన ఈ దివ్య కళార్చనలు, దర్శనం కోసం బారులు తీరిన లక్షలాది మంది భక్తులను ఆధ్యాత్మిక ఆనందడోలికల్లో ఓలలాడించాయి.



ఆధ్యాత్మిక నాదోపాసన -- కళాకారుల వివరాలు:

బి. సింధు బృందం సమర్పించిన సాంప్రదాయ తాళ భజనతో కళావేదిక ఆధ్యాత్మిక వైభవంతో ప్రారంభమైంది.

వాగ్దేవిని, జగన్మాతను కీర్తిస్తూ ఎన్. రిషిత, ఎం. లక్ష్మీ శ్యామల, నిర్మల ఉ పద్మ ఆలపించిన భక్తిరంజని సంకీర్తనలు, దేవీ స్తోత్రాలు భక్తులను నాదబ్రహ్మంలో ఓలలాడించాయి. హరికథా భాగవతారిణి పి. లలిత సమర్పించిన హరికథ భక్తులను విశేషంగా రంజింపజేసింది. జ్ఞానప్రదాయిని అయిన సరస్వతీ దేవి మహిమలను, పురాణ గాథలను సుమధుర గానం, అభినయంతో రంగరించి వివరించిన తీరు భక్తుల ప్రశంసలు అందుకుంది.

శాస్త్రీయ నృత్యార్చన :

సరస్వతీ కటాక్షాన్ని ఆకాంక్షిస్తూ చిన్నారులు కళాకారులు లయాన్విత అడుగులు, భావయుక్త ముద్రలతో కూచిపూడి, భరతనాట్య రీతులలో అద్భుత నాట్య నివేదన సమర్పించారు.

ఎస్. అక్షయ, పి. మంజుష, బి.వి.ఎన్. సౌమ్య, ఎం.వి.ఎల్. సత్యవాణి, వి. నివేదిత, ఎస్. విజయలక్ష్మి మణి భార్గవి, జి. సత్య ఆనందని, జి.ఎస్.ఎల్. నరసింహ శర్మ, జె. అంబిక, పద్మశ్రీ హేమంత్ సిహెచ్. పావని లత, వి. మౌనిక పట్నాయక్, బి. హరగోపాల్, త్రినాధాచారి, ఎస్. భార్గవి ఐ. దుర్గా శేషకుమారి, పి. సూర్య ప్రకాశరావు

కళాబృందాలు ప్రదర్శించిన శారదా భుజంగ ప్రయాత స్తోత్ర నృత్యాలు, సరస్వతీ వందనాలు, శివ–శక్తి నృత్య రూపకాలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. చదువుల తల్లి సన్నిధిలో సాగిన ఈ కళా ప్రదర్శనలు క్యూలైన్లలో ఉన్న భక్తులకు శ్రమ తెలియకుండా ఆధ్యాత్మిక అనుభూతిని పంచాయి. అమ్మవారి జన్మనక్షత్ర వేళ కళల రూపంలో సాక్షాత్కరించి నాట్యార్చన, గానార్చన చేసిన కళాకారులందరినీ దేవస్థాన అధికారులు ప్రశంసించి, శ్రీ అమ్మవారి శేషవస్త్రాలు, పవిత్ర ప్రసాదాలు, ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు.చిన్నారుల సందడితో కళావేదిక మార్మోగింది.

మాచర్ల పట్టణంలో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలు

ఈ నెల 30వ తేదీ వరకు ఆంక్షలు – 24 గంటలూ అమల్లో నిషేధాజ్ఞలు

మాచర్ల అక్టోబర్ 16 :(మహి న్యూస్): మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు, రానున్న ఎన్నికలు,ఓట్ల లెక్కింపు ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని మాచర్ల పట్టణంలో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (గతంలో సెక్షన్ 144 సీఆర్‌పీసీ) కింద నిషేధాజ్ఞలు విధించారు.మాచర్ల మున్సిపల్ అసిస్టెంట్ ఎన్నికల అధికారి,కమిషనర్ అభ్యర్థన మేరకు తహశీల్దార్,మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. 2026 అక్టోబర్ 16 నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు మాచర్ల పట్టణ పరిధిలో ఈ నిషేధాజ్ఞలు 24 గంటలూ అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా,ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం.

సీజేపీ తిరంగా యాత్ర.. ఢిల్లీలో హై అలర్ట్

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో తిరంగా యాత్ర నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. సీజేపీ ఆధ్వర్యంలో నేడు సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న తిరంగా యాత్ర దృష్ట్యా సెంట్రల్ పార్క్‌ను నేడు, రేపు మూసివేస్తున్నట్లు న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (వీణవీజ) ప్రకటించింది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (దీఎస్ఎస్) సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధించారు. సీజేపీ నిరసన కార్యక్రమానికి ప్రజలు దూరంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. అయితే, జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ గీతాన్ని ఆలపించేందుకు 11 మందితో కూడిన బృందానికి అనువైన ప్రదేశంలో అవకాశం కల్పిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. మరోవైపు, కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచే ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి రానున్నాయి. ఈ ప్రాంతం మీదుగా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు పోలీసుల సూచనలను పాటించాలని అధికారులు కోరారు. తిరంగా యాత్ర నేపథ్యంలో కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో రాకపోకలపై ఆంక్షలు ఉండటంతో ప్రయాణికులు ముందస్తుగా తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని సూచించారు.ు

గొల్లపల్లి రిజర్వాయర్ ఘటన.. వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సత్యసాయి జిల్లా. : గొల్లపల్లి రిజర్వాయర్‌లో పడి ఐదుగురు మహిళలు మృతి చెందిన ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన మహిళలు ఈ విధంగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని బాధిత కుటుంబాలకు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, వారికి తగిన ఆర్థిక సహాయం అందించాలని వైఎస్ జగన్ కోరారు. కాగా, శ్రీ సత్యసాయి జిల్లాలోని పెనుకొండలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. గొల్లపల్లి రిజర్వాయర్‌లో పడి ఐదుగురు మృతి చెందిన ఘటన శుక్రవారం(అక్టోబర్ 16వ తేదీ) మధ్యాహ్న సమయంలో చోటు చేసుకుంది. గొల్లపల్లి రిజర్వాయర్‌కు విహారయాత్రకు వెళ్లిన క్రమంలో ఈ విషాదం జరిగింది. ఈత కొట్టడానికి రిజర్వాయర్‌లో దిగి అందులో చిక్కుకుపోయి మృత్యువాత పడ్డారు. మృతులంతా మహిళలుగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

చంద్రబాబు,లోకేష్ డైరెక్షన్‌లోనే దాడులు: ఎంపీ మిథున్‌రెడ్డి



తిరుపతి : చంద్రబాబు,లోకేష్ డైరెక్షన్‌లోనే దాడులు జరుగుతున్నాయని రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నిక నామినేషన్ సమయంలో టీడీపీ గూండాలు జరిపిన దాడులపై తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. బయటి నుంచి గూండాలను తెప్పించి విధ్వంసం సృష్టించారు. మా కార్యకర్తలపై రాళ్లతో దాడులు చేయించారు. వాహనాలు ధ్వంసం చేసి నానా హంగామా చేశారు. టీడీపీకి గెలిచే సత్తాలేదు. అడ్డదారిలో గెలిపించుకునేందుకు నీచ రాజకీయాలు చేస్తున్నారు. రిటర్నింగ్ అధికారి నామినేషన్ పత్రాలు తీసుకోవడం లేదు. మాపై ఒత్తిడి ఉంది. తీసుకోలేమని అంటున్నారు.దమ్ముంటే నిజాయితీగా ఎన్నికలకు వెళ్లాలి’అని సవాల్ విసిరారు.


అధ్వానంగా కంబదూర్ ఎమ్మార్వో కార్యాలయం!

ఊడిపోతున్న పైకప్పు పెచ్చులు.. విరిగిన తలుపులు!

30 ఏళ్ల నాటి భవనంలో భయంభయంగా విధులు

నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు





అనంతపురం జిల్లా, కంబదూర్ । అక్టోబర్ 16 । (మహి న్యూస్): కంబదూర్ మండల తహసీల్దార్ కార్యాలయం దుస్థితికి చేరుకుంది. సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం ప్రస్తుతం శిథిలావస్థకు



చేరడంతో అధికారులు, సిబ్బంది, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోడలు, పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది.

విరిగిన తలుపులు.. పేరుకుపోయిన చెత్త

కార్యాలయంలోని కొన్ని గదులతో పాటు సర్వేయర్ గదుల తలుపులు సైతం విరిగిపోయి కనిపిస్తున్నాయి. తహసీల్దార్ గదికి ఎదురుగా ఉన్న గదిలో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయింది. ఇటీవల నిర్వహించిన వీఆర్ఏల ధర్నా అనంతరం కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేయకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని స్థానికులు చెబుతున్నారు. నిత్యం వివిధ రెవెన్యూ సేవల కోసం వచ్చే ప్రజలు కార్యాలయంలోని వసతులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కొత్త భవనం నిర్మించేదెప్పుడు?

మండల ప్రజలకు కీలకమైన రెవెన్యూ సేవలు అందించే కార్యాలయం ఇంతటి దుస్థితిలో ఉన్నప్పటికీ కొత్త భవన నిర్మాణానికి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మూడు దశాబ్దాలుగా పాత భవనంలోనే అరకొర వసతుల మధ్య పరిపాలన కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి

జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కంబదూర్ మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు, వివిధ సంఘాల నాయకులు కోరుతున్నారు. అప్పటివరకు ప్రస్తుత భవనంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి, విరిగిన తలుపులకు మరమ్మతులు చేయించాలని, పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్న ప్రాంతాలను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గుత్తి మున్సిపాలిటీలో సజావుగా నామినేషన్ల ప్రక్రియ

నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ ఓ. ఆనంద్

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను 24 గంటల్లో జారీ చేయాలని ఆదేశం

ఎన్నికల విధుల్లో నిబంధనలు కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచన



అనంతపురం, అక్టోబర్ 16: (మహి న్యూస్): జిల్లాలో మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరుగుతోందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ తెలిపారు. శుక్రవారం గుత్తి మున్సిపాలిటీలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందని, మూడు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నామినేషన్ కేంద్రంలో ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బందితో మాట్లాడి, శిక్షణ, నామినేషన్ల స్వీకరణ విధానం, అభ్యర్థుల నుంచి సేకరించాల్సిన పత్రాలు, రికార్డుల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల విధులకు సంబంధించిన హ్యాండ్‌బుక్‌లోని నిబంధనలను పూర్తిగా చదివి, విధానాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు, గొడవలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు



తీసుకోవాలని ఆదేశించారు. చివరి రోజు నామినేషన్ల స్వీకరణ సమయాన్ని మైక్ ద్వారా ప్రకటించాలని, సమయపాలనపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వీలైనంత త్వరగా, 24 గంటల్లోపే పత్రాలు జారీ చేయాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, తహసీల్దార్ పుణ్యవతి, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం జిల్లాలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన

ప్రకృతి, రసాయన వ్యవసాయ పద్ధతుల్లో మామిడి సాగుపై క్షేత్రస్థాయి పరిశీలన

150 ఎకరాల ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణంలో 35 ఎకరాల కాంపాక్ట్ బ్లాక్ సందర్శన

రైతుల సాగు అనుభవాలు, నేల ఆరోగ్య పరిరక్షణపై చర్చ



అనంతపురం, అక్టోబర్ 16: (మహి న్యూస్): అనంతపురం జిల్లాలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతు సాధికార సంస్థ ప్రతినిధుల బృందం సందర్శించి, సాగు పద్ధతులను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. రైతు సాధికార సంస్థ అనంతపురం జిల్లా చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ లక్ష్మా నాయక్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కుప్పం, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి వచ్చిన జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, రైతు శాస్త్రవేత్తలు, మెంటర్లు, డీపీపీలు, వైఆర్ఎఫ్‌లు, ఇతర సిబ్బంది ఈ సందర్శనలో పాల్గొన్నారు. తొలుత కూడేరు మండలం జల్లిపల్లి గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు ఆదినారాయణ మామిడి తోటను సందర్శించారు. గత ఐదేళ్లుగా పీఎండీఎస్ విధానంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఆయన సాగు అనుభవాలు, పంటల నిర్వహణ పద్ధతులను తెలుసుకున్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న మామిడి తోటతో పాటు, రసాయన వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న మరో మామిడి తోటను పరిశీలించారు. రెండు పద్ధతుల్లో పంటల పెరుగుదల, నేల పరిస్థితులు, సాగు నిర్వహణలో ఉన్న తేడాలను క్షేత్రస్థాయిలో గమనించారు. తదుపరి గార్లదిన్నె మండలం కొటంక గ్రామాన్ని సందర్శించారు. అక్కడ 150 ఎకరాల ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణంలో భాగంగా ఏర్పాటు చేసిన 35 ఎకరాల కాంపాక్ట్ బ్లాక్‌ను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ రైతు మనోహర్ తన సాగు అనుభవాలను, పంటల నిర్వహణ విధానాలను, ప్రకృతి వ్యవసాయం ద్వారా పొందుతున్న ప్రయోజనాలను బృందానికి వివరించారు. ఈ సందర్భంగా పంటల వైవిధ్యం, నేల ఆరోగ్య పరిరక్షణ, సహజ వ్యవసాయ ఇన్‌పుట్‌ల వినియోగం, కాంపాక్ట్ బ్లాక్ విధానం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలపై చర్చించారు. ఈ క్షేత్ర సందర్శన ద్వారా వివిధ జిల్లాల ప్రతినిధులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవడంతో పాటు, రైతుల అనుభవాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పీఎండీఎస్, కాంపాక్ట్ బ్లాక్ విధానాల ప్రాధాన్యతను అర్థం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎం డా. నవీన్, కన్సల్టెంట్ రాజా, డీపీఎంయూ వైపీ గణేష్, కమ్యూనికేషన్ విభాగానికి చెందిన కీర్తన, రైతు సాధికార సంస్థ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెన్షన్, జీపీఎఫ్ అదాలత్‌లో 160 ఫిర్యాదులకు అక్కడికక్కడే పరిష్కారం

75 పెన్షన్ అథరైజేషన్లు, 111 జీపీఎఫ్ అథరైజేషన్లు జారీ

పరిష్కారం కాని అర్జీలపై నిరంతర పర్యవేక్షణ

ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



అనంతపురం, అక్టోబర్ 16: (మహి న్యూస్): ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏ అండ్ ఈ) ఎస్. శాంతిప్రియ తెలిపారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ విజయవంతంగా ముగిసిందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అదాలత్‌లో మొత్తం 75 పెన్షన్ అథరైజేషన్లు, 111 జీపీఎఫ్ అథరైజేషన్లు జారీ చేసినట్లు తెలిపారు. పెన్షన్, జీపీఎఫ్, సీఎఫ్ఎంఎస్‌కు సంబంధించిన 160 ఫిర్యాదులకు అక్కడికక్కడే పరిష్కారం చూపినట్లు వెల్లడించారు. రెండో రోజు గురువారం ఉదయం, మధ్యాహ్నం కూడా అర్జీలను స్వీకరించి, కొన్ని సమస్యలకు తక్షణ పరిష్కారం అందించామని తెలిపారు. ఇంకా పరిష్కారం కాని అర్జీలను విజయవాడకు తీసుకెళ్లామని, వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించే వరకు పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమకు రావాల్సిన ప్రయోజనాలు పొందేలా చూడటంతో పాటు, ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంపైనా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో తొలిసారిగా నిర్వహించిన ఈ పెన్షన్, జీపీఎఫ్ అదాలత్‌కు పెన్షనర్లు, ఉద్యోగుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన జిల్లా యంత్రాంగానికి, పెన్షనర్లకు, మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT.15-603/1, RAJU ROAD, KAMAL NAGAR, ANANTHAPURAMU, ANDHRA PRADESH - 515001.PRINTED AT VSAR PUBLICATIONS 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL.. RNI NO : APTEL/26/A7631. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108
మహా న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

మాచర్ల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా
షేక్ సుల్తానా నామినేషన్ దాఖలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున తొలి నామినేషన్ సమర్పణ



మాచర్ల, అక్టోబర్ 16:(మహి న్యూస్): మాచర్ల మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా షేక్ సుల్తానా నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు శుక్రవారం మాచర్ల మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. మాచర్ల నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున తొలి నామినేషన్‌గా ఈ దాఖలు నిలిచినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

యోగా శిక్షకుడిగా గూడే నరసింహారావు ఎంపిక





రాజుపాలెం అక్టోబర్ 16:(మహి న్యూస్): పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం కోట నెమలిపురి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో పార్ట్‌టైమ్ యోగా శిక్షకుడిగా గూడే నరసింహారావు ఎంపికయ్యారు. అధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, పరిశీలన అనంతరం ఆయనను ఎంపిక చేసి నియామక పత్రం అందజేశారు. ఈ ఎంపిక కమిటీలో డాక్టర్ ఆర్. శ్రీనివాస్, రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌ఛార్జి వైద్యాధికారి డాక్టర్ వి. రాంబాబు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. శైలజ, గ్రామ పెద్ద ఏ. బాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ ఆయుష్ శాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

పట్టణ అభ్యర్థుల ఎన్నికల వ్యయ పరిమితులు ఖరారు


మేయర్ అభ్యర్థికి రూ.25 లక్షల వరకు వ్యయం
నగర పాలక సంస్థ వార్డు సభ్యులకు రూ.10 లక్షలు
పురపాలక సంఘం అధ్యక్షులకు రూ.20 లక్షలు
పురపాలక సంఘం వార్డు సభ్యులకు రూ.7.50 లక్షలు



గుంటూరు, అక్టోబర్ 16: (మహి న్యూస్): పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులు చేయాల్సిన ఎన్నికల వ్యయ పరిమితులను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు మేయర్ అభ్యర్థులు రూ.25 లక్షలు, నగర పాలక సంస్థ వార్డు సభ్యులు రూ.10 లక్షలు, పురపాలక సంఘం అధ్యక్షులు రూ.20 లక్షలు, పురపాలక సంఘం వార్డు సభ్యులు రూ.7.50 లక్షల వరకు మాత్రమే ఎన్నికల వ్యయం చేయాల్సి ఉంటుందని వివరించారు. ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా జరిగే ఏ అంశాన్నీ ఉపేక్షించరాదని స్పష్టం చేశారు. వ్యయ పర్యవేక్షణ కమిటీలు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, వీడియో వీయింగ్ బృందాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) బృందాలు రేయింబవళ్లు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. సంబంధిత నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, డేవిడ్, వెంకటేశ్, ఎస్.జి.ఎస్.డబ్ల్యూ సమన్వయ అధికారి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన
- జాయింట్ కలెక్టర్ సంజన శ్రీ హర్ష
స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ కేంద్రాల తనిఖీ
భద్రతా ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు
స్ట్రాంగ్ రూముల వద్ద 24 గంటల పోలీసు బందోబస్తు





సత్తెనపల్లి, అక్టోబర్ 16: (మహి న్యూస్): జడ్పీటీసీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా సత్తెనపల్లిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్, జడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంజన శ్రీ హర్ష తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల వద్ద 24 గంటల పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

స్థానిక ఎన్నికల వేళ ముందస్తు చర్యలు..
145 మందిని బైండోవర్ చేసిన దుర్గి పోలీసులు



దుర్గి అక్టోబర్ 16:(మహి న్యూస్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు దుర్గి పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దుర్గి ఎస్సై బి. గోపాల్ ఆధ్వర్యంలో చర్యలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో గత ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడినవారు, సమస్యాత్మక వ్యక్తులు, రౌడీషీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తులు కలిపి ఇప్పటివరకు 145 మందిని గుర్తించి, ఎన్నికల సమయంలో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండేందుకు దుర్గి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ తరఫున ముందస్తు చర్యలు కొనసాగిస్తున్నట్లు ఎస్సై బి. గోపాల్ తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

అమరావతి ప్రాంతంలోని పెట్టుబడి అవకాశాలను అందిపుచ్చుకోండి

రాష్ట్రంలో సుస్థిర, సమ్మిళిత ఆర్థిక అభివృద్ధికి ప్రణాళికలు
46 ప్రాజెక్టుల పనులు కొనసాగింపు
26 ఎంఎస్ఎంఈలకు 480 ఎకరాల కేటాయింపు
పెట్టుబడిదారులకు రాష్ట్ర యువజన సర్వీసులు, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ పిలుపు



గుంటూరు, అక్టోబర్ 16: (మహి న్యూస్): అమరావతి ప్రాంతంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు అందిపుచ్చుకోవాలని రాష్ట్ర యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ కోరారు. శుక్రవారం అమరావతిలోని



ఎస్.ఆర్.ఎం. విశ్వవిద్యాలయంలో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రాంతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రావత్ మాట్లాడుతూ రాష్ట్ర జీడీపీలో ఈ ప్రాంతంలోని తొమ్మిది జిల్లాలు 35 శాతం వాటాను అందిస్తున్నాయని తెలిపారు. 2030, 2035, 2047 సంవత్సరాల లక్ష్యాలకు అనుగుణంగా ఆర్థిక అభివృద్ధి ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. సుస్థిర, సమ్మిళిత అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. ఈ ప్రాంతంలో వివిధ రంగాలకు సంబంధించి 46 ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని, 26 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు 480 ఎకరాలు కేటాయించినట్లు వివరించారు. మచిలీపట్నం పోర్టు అనుసంధానం పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. ప్రకాశం జిల్లాలో బీపీసీఎల్ రిఫైనరీ, దోనేపూడిలో భారత డైనమిక్స్ సంస్థ యూనిట్ ఏర్పాటు కానున్నాయని చెప్పారు. పర్యాటక రంగంలోనూ విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

అమరావతి ప్రధాన ఆర్థిక అభివృద్ధి ప్రాంతంగా ఎదుగుతుంది

పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ అమరావతి ప్రాంతం రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. ఆర్థిక వృద్ధి, పెట్టుబడులు, సుస్థిర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. హైస్పీడ్ రైళ్లతో పాటు సమీకృత మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందనున్నాయని, వివిధ రంగాల్లోని అవకాశాలను గుర్తించి ముందుకు సాగుతున్నామని వివరించారు. పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ పోర్టులు, నౌకా నిర్మాణ క్లస్టర్లు, ఆహార శుద్ధి పరిశ్రమల క్లస్టర్లు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ప్రాంతాలను ఆర్థిక అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.

పెట్టుబడులు, ఉపాధి అవకాశాలపై చర్చ

సీఐఐ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నరేంద్ర కుమార్ శరణం, ఐటీసీ అగ్రి బిజినెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాహుల్ గౌరహ, పీఐ డేటా సెంటర్స్ సీఈఓ కళ్యాణ్ ముప్పనేని మాట్లాడుతూ రాష్ట్రంలో సహజ వనరులు, పారిశ్రామిక నైపుణ్యం, మౌలిక సదుపాయాలు, స్పష్టమైన విధానపరమైన ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. వీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, ఎగుమతులకు ప్రముఖ గమ్యస్థానంగా అభివృద్ధి చేయవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఐటీసీ కట్టుబడి ఉందని సంస్థ ప్రతినిధి తెలిపారు. రైతులకు డిజిటల్, భౌతిక వ్యవస్థల సమన్వయంతో సమగ్ర సేవలు అందిస్తున్నట్లు వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ ఆధారాలతో కూడిన వ్యవసాయ సలహాలతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలకు కూడా సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పీఓ) ద్వారా ఈ కార్యకలాపాలను విస్తరిస్తున్నామని తెలిపారు. ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక



అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ స్థానిక ప్రజలకు స్థిరమైన ఆదాయ మార్గాలు కల్పించడం, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడం, స్థానిక సంస్థలను బలోపేతం చేయడం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వం, పెట్టుబడిదారుల మధ్య ఒప్పందాలు కుదిరాయి.

ఈ కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని, రవాణా శాఖ కార్యదర్శి కోన శశిధర్, సీఆర్‌డీఏ కమిషనర్ విజయ రామరాజు, ఆర్థిక అభివృద్ధి మండలి సీఈఓ షన్ మోహన్, జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఇతర ఉన్నతాధికారులు, పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొన్నారు.

గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో 8 నామినేషన్లు
టీడీపీ నుంచి 6, స్వతంత్ర అభ్యర్థుల నుంచి 2 నామినేషన్లు
ఈ నెల 19న నామినేషన్ల పరిశీలన, తుది అభ్యర్థుల జాబితా ప్రకటన



గుంటూరు, అక్టోబర్ 16: (మహి న్యూస్): గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం మొత్తం 8 నామినేషన్లు దాఖలైనట్లు నగర కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కె. మయూర్ అశోక్ తెలిపారు. వీటిలో తెలుగుదేశం పార్టీ తరఫున 6, స్వతంత్ర అభ్యర్థుల నుంచి 2 నామినేషన్లు వచ్చాయని వెల్లడించారు.

వార్డుల వారీగా నామినేషన్ల వివరాలు
45వ వార్డు: టీడీపీ నుంచి 1 నామినేషన్
53వ వార్డు: టీడీపీ నుంచి 1 నామినేషన్
62వ వార్డు: టీడీపీ నుంచి 1 నామినేషన్
54వ వార్డు: టీడీపీ నుంచి 1 నామినేషన్
57వ వార్డు: టీడీపీ నుంచి 2 నామినేషన్లు
16వ వార్డు: స్వతంత్ర అభ్యర్థుల నుంచి 2 నామినేషన్లు

ఈ నెల 19న నామినేషన్లను పరిశీలించి, అనంతరం తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నట్లు నగర కమిషనర్ తెలిపారు. మహేష్, జీఎంసీ ఎంఎల్ఓ.

పశువేముల రైతు భూ సమస్యకు పరిష్కారం..
వెబ్‌ల్యాండ్‌లో భూమి నమోదు



మాచర్ల అక్టోబర్ 16:(మహి న్యూస్): పశువేముల గ్రామానికి చెందిన రైతు భూమికి సంబంధించిన వెబ్‌ల్యాండ్ అడంగల్ సమస్యను రెవెన్యూ అధికారులు పరిష్కరించారు. మాచర్ల మండలం పశువేముల గ్రామానికి చెందిన జటావత్ దీప్ల, తన వ్యవసాయ భూమికి వెబ్‌ల్యాండ్ అడంగల్ అందుబాటులో లేకపోవడంతో అధికారులకు అర్జీ సమర్పించారు. సర్వే నంబర్ 260-2లో ఉన్న రెండు ఎకరాల భూమికి సంబంధించిన సమస్యపై మాచర్ల తహశీల్దార్ కిరణ్ కుమార్ గురజాల రెవెన్యూ డివిజనల్ అధికారికి నివేదిక సమర్పించారు. అనంతరం సాంకేతిక సమస్యను పరిష్కరించి, జటావత్ దీప్ల భార్య జటావత్ భామిని వెబ్‌ల్యాండ్ అడంగల్‌లో నమోదు చేశారు. ఈ మేరకు అడంగల్ కాపీని ఆమెకు అందజేశారు.

భూమాతకు అనారోగ్యం.. పచ్చని వనాలతోనే ప్రాణం!
నంద్యాల కవి కొప్పుల ప్రసాద్ పర్యావరణ పరిరక్షణపై కవిత



నంద్యాల, అక్టోబర్ 16: (మహి న్యూస్): పెరుగుతున్న కాలుష్యం, భూతాపం, కరుగుతున్న హిమానీనదాలు, పెరుగుతున్న సముద్ర మట్టాల వల్ల భూమాత ఎదుర్కొంటున్న ముప్పును కవి కొప్పుల ప్రసాద్ తన కవిత ద్వారా కళ్లకు కట్టినట్లు వివరించారు. "భూమాతకు అనారోగ్యం" అనే కవితలో పర్యావరణ కాలుష్యంపై ఆవేదన వ్యక్తం చేస్తూ, ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యతను గుర్తుచేశారు. పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్య వాయువులు, వ్యర్థాల నుంచి వెలువడే మీథేన్ వాయువు భూగోళాన్ని వేడెక్కిస్తున్నాయని కవితలో ప్రస్తావించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా హిమానీనదాలు కరుగుతూ, సముద్ర మట్టాలు పెరిగి తీర ప్రాంతాలకు ముప్పు ఏర్పడుతోందని వివరించారు. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కవిత హెచ్చరిస్తోంది. భూమాతను కాపాడుకోవాలంటే పచ్చని వనాలను పెంచాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కవి సందేశమిచ్చారు.

కొలనుభారతీ క్షేత్రంలో మూలానక్షత్ర ప్రత్యేకపూజలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు



శ్రీశైలం, మహి న్యూస్, అక్టోబర్ 16 : శ్రీశైలదేవస్థాన దత్తత దేవాలయమైన కొలనుభారతీక్షేత్రంలో మూలానక్షత్రం సందర్భంగా ఈ రోజు (16.10.2026) సరస్వతీ అమ్మవారికి ప్రత్యేకపూజలు, అభిషేకాది అర్చనలు జరిపించబడ్డాయి. సుమారు 5వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా దేవస్థానం వివిధ ఏర్పాట్లు చేయడం జరిగింది. భక్తులందరికీ ఉచిత దర్శనం కల్పించబడింది. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేయబడ్డాయి. అదేవిధంగా ఎటువంటి అంతరాయం లేకుండా భక్తులకు మంచినీరు అందజేయబడ్డాయి. దేవస్థానం తరుపున భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. దాదాపు 3వేల మంది భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు. ఉత్సవ నిర్వహణకుగాను దేవస్థానం అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించబడ్డాయి. పలువిభాగాల అధికారులు, సిబ్బంది ఉత్సవనిర్వహణలో విధులు నిర్వర్తించారు. పలువురు భక్తులు చిన్నారులకు అక్షరాభ్యాసం జరిపించుకున్నారు. ఈ అక్షరాభ్యాసాలు సామూహికంగా నిర్వహించబడ్డాయి. మూలానక్షత్రం సందర్భంగా ఈ ఉదయం గం. 4.00లకు ఆలయప్రధాన ద్వారాలు తెరువబడ్డాయి. మంగళవాయిద్యాలతో ఆలయకైంకర్యాలు ప్రారంభించబడ్డాయి. ముందుగా తీర్థబిందెసేవ జరిపించబడింది. ఈ తీర్థ బిందుసేవలో అర్చకస్వాములు సంప్రదాయబద్ధంగా కొలను నుండి జలాలను తీసుకొని ఆలయప్రవేశం చేయడం జరిగింది. తరువాత ఉత్సవం నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతిపూజ జరిపించబడింది. అనంతరం అమ్మవారికి విశేషఅభిషేకం, ప్రత్యేకపూజలు, పుష్పార్చన, బాలభోగనివేదన, మహామంగళహారతి కార్యక్రమాలు జరిపించబడ్డాయి. . అనంతరం ఉదయం గం. 6.00ల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనాలు మరియు సామూహిక అక్షరభ్యాసాలకు అనుమతించడం జరిగింది. మధ్యాహ్నం గం.11.15లకు అమ్మవారి మధ్యాహ్నకాలపూజలు, మహానివేదన తరువాత గం. 11.45 నుంచి దర్శనాలు కొనసాగించబడ్డాయి. తిరిగి సాయంకాలం గం. 6.00లకు ప్రదోషకాలపూజ, నివేదన, మహామంగళహారతుల జరిపించబడ్డాయి. రాత్రి గం. 7.00లకు కవాటబంధనం (ఆలయద్వారాలు మూసివేత) ఉంటుంది.

రాజకీయ ప్రకటనలపై ప్రత్యేక నిఘా.. పెయిడ్ న్యూస్‌పై పర్యవేక్షణ

మీడియా ప్రకటనల పరిశీలనకు జిల్లా స్థాయిలో ఎంసీఎంసీ ఏర్పాటు
ఎన్నికల ప్రచార ప్రకటనల ఖర్చును వ్యయ ఖాతాలో నమోదు చేయాలి
నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకుంటాం: కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల, అక్టోబర్ 16: (మహి న్యూస్): నంద్యాల జిల్లాలో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలకు నిర్వహించనున్న రెండో సాధారణ ఎన్నికలు-2026 నేపథ్యంలో రాజకీయ ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌పై పటిష్ట పర్యవేక్షణ చేపట్టేందుకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి. రాజకుమారి తెలిపారు. ఎన్నికల సమయంలో రాజకీయ ప్రకటనలు, వార్తా కథనాల రూపంలో ప్రచురితమయ్యే ప్రకటనలు, చెల్లింపు వార్తలను గుర్తించి పర్యవేక్షించడం కమిటీ ప్రధాన బాధ్యత అని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఎంసీఎంసీకి జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ గనోరే ఛైర్మన్‌గా, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శివశంకర్ సభ్యుడిగా, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి జె. మల్లికార్జునయ్య సభ్యుడిగా వ్యవహరిస్తారని తెలిపారు.

వివిధ మాధ్యమాల్లో ప్రకటనల పరిశీలన

జిల్లాలోని వార్తాపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, టీవీ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియో, సినిమా హాళ్లు, బహిరంగ ప్రదేశాల్లోని ఆడియో-విజువల్ డిస్‌ప్లేలు, ఈ-పేపర్లు, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ సందేశాలు, సామాజిక మాధ్యమాల్లో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనలను కమిటీ నిరంతరం పరిశీలిస్తుందని కలెక్టర్ తెలిపారు. వార్తా కథనాల ముసుగులో ప్రచురితమయ్యే రాజకీయ ప్రకటనలను గుర్తించి ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పర్యవేక్షణ చేపడతామని పేర్కొన్నారు.

పెయిడ్ న్యూస్‌పై ప్రత్యేక దృష్టి

1ల. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు అనుకూలంగా లేదా ప్రతికూలంగా ప్రచురితమయ్యే చెల్లింపు వార్తలను కమిటీ గుర్తించి పర్యవేక్షిస్తుంది.

2ల. అభ్యర్థుల తరఫున ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జరిగే రాజకీయ ప్రకటనలను పరిశీలిస్తుంది.

3ల. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం జరిగినట్లు గుర్తిస్తే సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించి, అభ్యర్థులకు నోటీసులు జారీ చేసేలా చర్యలు తీసుకుంటారు.

4ల. అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి చేసిన ఖర్చుల వివరాలను సమర్పించని సందర్భాల్లో, నిర్ధారించిన ప్రామాణిక రేట్ల ఆధారంగా ప్రకటనల వ్యయాన్ని అంచనా వేసి, నిబంధనల ప్రకారం సంబంధిత అభ్యర్థి ఎన్నికల వ్యయ ఖాతాలో నమోదు చేసేలా చర్యలు చేపడతారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అన్ని మీడియా సంస్థలు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలని కలెక్టర్ సూచించారు. రాజకీయ ప్రకటనలు, ఎన్నికల ప్రచారానికి సంబంధించిన అంశాల్లో నిబంధనలను ఉల్లంఘించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. డీఐపీఆర్ఓ, నంద్యాల ద్వారా జారీ.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT 1/702, BEHIND BHARAT PETROL PUMP, GUNTUR, A.P - 522001.PRINTED AT VSAR PUBLICATIONS178/1, ANJANEYA VAGU, KOTHAPETA,VIJAYAWADA (URBAN), N T R, A.P -520001. RNI NO : APTEL/26/A7632. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

తిరుపతి మేయర్ స్థానానికి ఆప్ అభ్యర్థి నామినేషన్

తొలిరోజు మేయర్ స్థానానికి ఒక నామినేషన్

కార్పొరేటర్ స్థానాలకు 88 నామినేషన్లు దాఖలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి అత్యధికంగా 61 నామినేషన్లు

తిరుపతి, అక్టోబర్ 16: (మహి న్యూస్): తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తొలిరోజు శుక్రవారం మేయర్ స్థానానికి ఒకటి, కార్పొరేటర్ స్థానాలకు 88 నామినేషన్లు దాఖలయ్యాయి. మేయర్ అభ్యర్థిగా ఆమ్ ఆద్మీ పార్టీ తరపున నీరుగట్టు నగేష్ నామినేషన్ సమర్పించారు. కార్పొరేటర్ స్థానాలకు పార్టీలు, ఇతర అభ్యర్థుల నుంచి వచ్చిన నామినేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి.



తెలుగుదేశం పార్టీ – 10
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ – 61
జనసేన పార్టీ – 4
సీపీఐ – 1
ఇతరులు – 12

తొలిరోజు మేయర్, కార్పొరేటర్ స్థానాలకు కలిపి మొత్తం 89 నామినేషన్లు దాఖలైనట్లు తిరుపతి జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ వెల్లడించింది.

తపాలా శాఖలో ప్రత్యక్ష ఏజెంట్లుగా పనిచేసేందుకు అవకాశం

పదో తరగతి ఉత్తీర్ణులకు అర్హత.. ఈ నెల 29 దరఖాస్తులకు చివరి తేదీ

కడప, మహి న్యూస్, అక్టోబర్ 16: భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ), గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్పీఎల్ఐ) పథకాల ప్రత్యక్ష ఏజెంట్లుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కడప డివిజన్ తపాలా కార్యాలయాల సూపరింటెండెంట్ జి. రాజేష్ తెలిపారు. పదో తరగతి లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు ప్రజలకు జీవిత బీమా పథకాలపై అవగాహన కల్పిస్తూ, నిబంధనల ప్రకారం ప్రోత్సాహకాలు పొందడంతో పాటు అదనపు ఆదాయం సంపాదించవచ్చని వివరించారు. ప్రత్యక్ష ఏజెంట్లుగా పనిచేయడానికి నిబంధనల ప్రకారం రూ.5,000 విలువైన జాతీయ పొదుపు పత్రాన్ని (ఎన్ఎస్సీ) డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల నాయకులు, చురుకైన సభ్యులు, ఇతర ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన సభ్యులకు ఈ సమాచారాన్ని తెలియజేసి, తపాలా శాఖ ప్రత్యక్ష ఏజెంట్లుగా పనిచేసేందుకు ప్రోత్సహించాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు: కడప డివిజన్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ అభివృద్ధి అధికారి పి. మునాఫ్‌ను 6303248943 నంబరులో సంప్రదించాలి.

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు అందుబాటులో నామినేషన్ పత్రాలు


మదనపల్లె, మహి న్యూస్, అక్టోబరు 16: మదనపల్లె మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులకు నామినేషన్ పత్రాలు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని మున్సిపల్ కమిషనర్ ప్రమీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయం నుంచి నామినేషన్ పత్రాలను తీసుకొని, వాటిలోని నిర్దిత కాలాలను పూర్తి సమాచారంతో నింపి, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జతచేయాలని సూచించారు. పూర్తి చేసిన నామినేషన్ పత్రాలను మదనపల్లెలోని దొంతి లేఅవుట్ వద్ద, మున్సిపల్ వాహన పార్కింగ్ సమీపంలో ఉన్న సహాయ ఎన్నికల అథారిటీ నూతన భవనంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో దాఖలు చేయవచ్చని కమిషనర్ ప్రమీల ఆ ప్రకటనలో తెలిపారు.

వైభవంగా శ్రీ దుర్గా మల్లేశ్వరుల దివ్య నగరోత్సవం



ఇంద్రకీలాద్రి, మహి న్యూస్, అక్టోబర్ 16: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో ఆరవ రోజు, అమ్మవారి జన్మనక్షత్రమైన పరమ పవిత్ర మూలా నక్షత్రం పర్వదినాన శుక్రవారం సాయంత్రం ఆదిదంపతులైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దివ్య నగరోత్సవం భక్తుల జయజయధ్వానాల నడుమ ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఇంద్రకీలాద్రి శిఖరాన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారు శ్వేతాంబరియై, వీణాపాణిగా సాక్షాత్తు జ్ఞానప్రదాయిని శ్రీ సరస్వతీ దేవి దివ్యాలంకారంలో భక్తులకు కరుణామృత దృష్టితో దర్శనమిస్తుండగా, పరమ పవిత్రమైన ప్రదోషకాల సమయంలో కొండపై కొలువుదీరిన శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులకు ప్రధాన అర్చకులు శాస్త్రోక్తంగా విశేష పూజలు, దివ్య మంగళ హారతులు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ నగరోత్సవం అత్యంత కోలాహలంగా ప్రారంభమైంది. నగరోత్సవ రథం ముందుకు కదులుతుండగా సుమధుర శాక్సోఫోన్ వాయిద్యాలు, సంప్రదాయ కేరళ పంచవాద్యాల దరువులు, గుస్సాడీ కళావిన్యాసాలు మరియు మహిళా భక్తుల లయాన్విత కోలాటాలు వీధుల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రతిధ్వనింపజేశాయి. శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రారంభమైన ఊరేగింపు రథం సెంటర్, వన్ టౌన్ వినాయక గుడి, కెనాల్ రోడ్డు, పవిత్ర కృష్ణా నదీ తీరాన ఉన్న దుర్గా ఘాట్ మీదుగా ఘాట్ రోడ్డు ద్వారా సాగింది. వేలాది మంది భక్తులు పాదయాత్రగా నగరోత్సవం వెంట నడుస్తూ "జై భవానీ.. జై జై భవానీ", "ఓం శ్రీ మాత్రే నమః" అంటూ చేసిన జయజయధ్వానాలతో ఇంద్రకీలాద్రి పరిసరాలు మార్మోగాయి. సర్వాంగసుందరంగా విద్యుద్దీపాలు, సుగంధ పుష్పాలతో ముస్తాబు చేసిన రథంపై కొలువుదీరిన ఆదిదంపతులను దర్శించుకునేందుకు పురవీధుల్లో భక్తజనం బారులు తీరారు. మార్గమధ్యంలో భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ, కొబ్బరికాయలు కొడుతూ స్వామి, అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో ఘన నీరాజనాలు పలికారు. నగరోత్సవం ఘనంగా కొండపైకి చేరుకున్న అనంతరం ఆలయ మహారాజగోపురం ఎదుట సంప్రదాయబద్ధంగా "ఆస్థాన కార్యక్రమం" నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక బృందం ఉత్సవ మూర్తులకు వేదోక్తంగా శాస్త్రోక్త పూజలు, పంచహారతులు సమర్పించారు. చదువుల తల్లి, జ్ఞానస్వరూపిణి అయిన సరస్వతీ దేవి అలంకారంలో కొలువుదీరిన మూలా నక్షత్ర పర్వదినాన ఆదిదంపతులను రథారూఢులుగా దర్శించుకోవడం వల్ల అజ్ఞానం, జడత్వం తొలగి జ్ఞానసంపద, విద్యాబుద్ధులు, కుటుంబ క్షేమం చేకూరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ మహోత్సవంలో ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు, సహాయ కార్యనిర్వహణాధికారి,ఆలయ ఉద్యోగులు, అశేష భక్తజనం పాల్గొని ఆదిదంపతుల కృపాకటాక్షాలను పొందారు.

అనకాపల్లి జోన్-10 కూటమి అభ్యర్థుల ఎంపికపై వీడని ఉత్కంఠ!



అనకాపల్లి: అనకాపల్లి జోన్-10లోని ఆరు వార్డులకు కూటమి అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నుంచి ఇప్పటివరకు అభ్యర్థుల జాబితా వెలువడకపోవడంతో టికెట్లు ఆశిస్తున్న వారిలో టెన్షన్ నెలకొంది. మరోవైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఖరారు చేసినట్లు ప్రచారంలో ఉన్న ఓ జాబితా రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. కూటమిలోని మూడు పార్టీల నుంచి టికెట్ ఎవరికి దక్కుతుందనే అంశంపై ఆశావహుల్లో అయోమయం నెలకొంది. అభ్యర్థుల బలాబలాలు, స్థానికంగా ఉన్న పరిస్థితులు, గెలుపు అవకాశాలకు సంబంధించిన అంశాలను పార్టీ నాయకత్వాలు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. జనసేన తరపున అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టీడీపీ తరపున నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అభ్యర్థుల ఎంపికపై ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఆశావహులతో చర్చలు జరుపుతూ, అందుబాటులో ఉన్న వివరాలను పరిశీలించి అభ్యర్థుల జాబితాను సిద్ధం చేసే ప్రక్రియలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆరు వార్డుల్లో కూటమి తరపున ఎవరికి అవకాశం దక్కుతుంది? ఏ పార్టీకి ఎన్ని స్థానాలు కేటాయిస్తారు? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అధికారిక జాబితా విడుదలయ్యే వరకు ఆశావహుల్లో ఉత్కంఠ కొనసాగనుంది.

నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుషార్ డూడి

ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

నామినేషన్ కేంద్రాల్లో భద్రతా చర్యల పరిశీలన

ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై కఠిన చర్యలు

పలమనేరు, అక్టోబర్ 16: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలనుప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు



అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. శుక్రవారం పలమనేరు మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, ఎస్పీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సదుపాయాలు, భద్రతా చర్యలు, అధికారుల విధుల నిర్వహణ, ఎన్నికల నియమావళి అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నామినేషన్ల



ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని, ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ, ఎన్నికలు భయరహిత వాతావరణంలో జరిగేలా చిత్తూరు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, అభ్యర్థులు లేదా వారి మద్దతుదారులను బెదిరించడం, ఓటర్లను ప్రలోభపెట్టడం, భయభ్రాంతులకు గురిచేయడం, గుంపులుగా చేరి ఉద్రిక్తతలు సృష్టించడం వంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని ఎస్పీ సూచించారు. బెదిరింపులు, ప్రలోభాలు, గొడవలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు



తెలియజేయాలని కోరారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే పోస్టులు, నిర్ధారణ కాని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంటుందని, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఆర్డీఓ భవాని, మున్సిపల్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి

ఎన్నికల కమిషన్ సూచనల మేరకే విధులు నిర్వర్తించాలి

ఆర్వో హ్యాండ్‌బుక్‌లోని నిబంధనలపై పూర్తి అవగాహన ఉండాలి

నామినేషన్ల స్వీకరణలో పారదర్శకత పాటించాలి

చిత్తూరు, అక్టోబర్ 16: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల విధులను అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా నిర్వహించాలని

జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడు సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకే విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. శుక్రవారం చిత్తూరు జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై



అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నందున అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు, ఆ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్వోలు) ఆర్వో హ్యాండ్‌బుక్‌లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో సొంత నిర్ణయాలు తీసుకోకుండా ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం వ్యవహరించాలని స్పష్టం చేశారు. అధికారులకు కేటాయించిన డివిజన్లలో ఓటర్ల జాబితాలను పరిశీలించాలని, ఓటర్ల ప్రాతిపదికన రిజర్వేషన్ల కేటాయింపు, పోలింగ్ కేంద్రాల తనిఖీ, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా ఓటర్ల జాబితాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

నామినేషన్ల స్వీకరణలో పారదర్శకత పాటించాలి

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని చిత్తూరు డీఎల్‌డీఓ రవికుమార్, సౌందర్ రాజన్ సూచించారు. నామినేషన్ పత్రాల పరిశీలన, అవసరమైన ధ్రువపత్రాల ధృవీకరణ, అభ్యర్థుల అర్హతలు, నామినేషన్ల తిరస్కరణకు సంబంధించిన నిబంధనలపై అధికారులకు వివరించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియల్లో ఎలాంటి పొరపాట్లకు



తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులను తప్పనిసరిగా పాటిస్తూ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, డ్వామా పీడీ రవికుమార్, జిల్లా విద్యాశాఖ డీఈవో లక్ష్మీనారాయణ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు. విడుదల: డీడీ, సమాచార పౌరసంబంధాల శాఖ, చిత్తూరు.

స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

మదనపల్లె, మహి న్యూస్, అక్టోబరు 16 :- అన్నమయ్య జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం మదనపల్లి కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో స్థానిక సంస్థల ఎన్నికల సంసిద్ధత, నామినేషన్లు, పోలింగ్ కేంద్రాలు, భద్రత, ఎన్నికల సామగ్రి నిర్వహణ తదితర అంశాలపై జిల్లా ఎన్నికలనోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ, ఎలాంటి పొరపాట్లకు, నిర్లక్ష్యానికి తావులేకుండా ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న రాజకీయ నాయకుల ఫొటోలు, రాజకీయ ఫ్లెక్సీలు, గోడలపై రాతలు (వాల్ రైటింగ్స్), క్యాలెండర్లు తదితర రాజకీయ ప్రచార సామగ్రిని తక్షణమే తొలగించాలని సూచించారు.



ఎన్నికల విధుల్లో నిష్పక్షపాత ధోరణి

ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు రాజకీయ పక్షపాతానికి తావులేకుండా తటస్థంగా వ్యవహరించాలన్నారు. సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని, శాంతిభద్రతల కోసం పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

నామినేషన్ల ప్రక్రియ

మూడు మున్సిపాలిటీలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటనను ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. నామినేషన్ కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, ఏర్పాట్లు ఎప్పటికప్పుడు సమన్వయం చేయాలని ఆదేశించారు.

పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లు

పోలింగ్, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ ప్రదేశాలను ముందుగానే గుర్తించి ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, రవాణా, భద్రపరిచే ప్రక్రియకు పోలీసు భద్రత కల్పించాలని, పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్‌కు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

శాఖల సమన్వయం, నియమావళి అమలు

రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సామగ్రి తరలింపు, స్ట్రాంగ్ రూముల భద్రత, పోలింగ్ కేంద్రాల బందోబస్తు, సున్నిత ప్రాంతాల్లో నిఘాపై పోలీసు అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు. అనుమతి లేకుండా రాజకీయ ఫ్లెక్సీలు, ప్రచార బోర్డులు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. ప్రతి అధికారి రోజువారీ సమీక్షల ద్వారా సమస్యలను వెంటనే పరిష్కరించి, నిర్దిత కాలపరిమితిలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్ఓ ఏ. వెంకటేష్, ఆర్డీవో విజయలక్ష్మి, ఎస్డిసి మాధవ కృష్ణారెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మీపతి, జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ, జిల్లా నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు సీఎం చంద్రబాబు దంపతులు చీర, సారె సమర్పణ

విజయవాడ, మహి న్యూస్, అక్టోబర్ 16:- ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీసమేతంగా దర్శించుకున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు సీఎం తెలిపారు. దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ ముఖ్యమంత్రికి పరివేష్టం అలంకరించారు. అనంతరం సీఎం పట్టువస్త్రాలు, సారెను అమ్మవారికి సమర్పించారు . పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారి అంతరాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. సీఎం పట్టువస్త్రాలు సమర్పించే సమయంలోనూ సామాన్య భక్తుల దర్శనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా క్యూ లైన్లను కొనసాగించారు. పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు సీఎం దంపతులకు వేదాశీస్సులు అందజేశారు. ఈవో శీనానాయక్ అమ్మవారి శేషవస్త్రాలను అందించగా, ఆలయ చైర్మన్, ఈవో అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

6 రోజుల్లో 8 లక్షల మంది భక్తుల దర్శనం

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... 'రాష్ట్ర ప్రజలందరికీ



దసరా శుభాకాంక్షలు. ప్రభుత్వం తరఫున కుటుంబ సమేతంగా అమ్మవారికి చీర, సారె సమర్పించి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించాను. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పాలక మండలి, అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఆరు రోజుల్లోనే ఎనిమిది లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భక్తిశ్రద్ధలతో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు. విజయవాడ ఉత్సవ్ 2.0, జాతీయ సరస్ మేళా కూడా ఇక్కడే జరుగుతున్నాయి. దేశంలో ప్రముఖంగా నిర్వహించే ఉత్సవాల్లో విజయవాడ దసరా ఉత్సవాలు చోటు సంపాదించుకోవడం శుభపరిణామం. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించాను. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఆకాంక్షించాను. ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజంగా తీర్చిదిద్దాలని అమ్మవారిని కోరుకున్నాను' అని సీఎం చంద్రబాబు అన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108
మహా న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

గూడూరు, జులకల్ గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి
ఓటర్లు భయాందోళనలు లేకుండా ఓటు హక్కు
వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలి
కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు, అక్టోబర్ 16: (మహి న్యూస్): ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గూడూరు, జులకల్ గ్రామాల్లో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రాలను ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పాత నేరస్థులు, ఎన్నికల సమయంలో గొడవలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు సీఐ తబ్రేజ్, గూడూరు ఎస్ఐ రాజా కుళాయప్ప, సి. బెళగల్ ఎస్ఐ వేణుగోపాల రాజు పాల్గొన్నారు.


పోలకల్‌లో అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రం తనిఖీ

పటిష్ట బందోబస్తు, నిరంతర నిఘా ఏర్పాటు చేయాలి
రూట్ మార్చ్‌లతో ప్రజల్లో భరోసా కల్పించాలి
ఓటర్లు భయం లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలి
కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్





కర్నూలు, అక్టోబర్ 16: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ చర్యలు చేపట్టారు. శుక్రవారం సి. బెళగల్ మండలం పోలకల్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లు, రూట్ మ్యాప్, పోలీసు బందోబస్తును పరిశీలించి, సంబంధిత పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు ప్రణాళికతో భద్రతను పటిష్టం చేయాలని, నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్, రూట్ మార్చ్‌లు నిర్వహించి ప్రజల్లో భరోసా కల్పించాలని ఎస్పీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు సీఐ తబ్రేజ్, సి. బెళగల్ ఎస్ఐ వేణుగోపాల రాజు, గూడూరు ఎస్ఐ రాజా కుళాయప్ప పాల్గొన్నారు.



కల్లూరు అర్బన్‌లో టీడీపీలో చేరిన 50 కుటుంబాలు

గౌరు చరిత, వెంకటరెడ్డి దంపతులు, గౌరు జనార్దన్ రెడ్డి సమక్షంలో చేరికలు
పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన టీడీపీ నాయకులు





కర్నూలు, అక్టోబర్ 16: (మహి న్యూస్): కర్నూలు జిల్లా కల్లూరు అర్బన్ 45వ వార్డు శివప్ప నగర్‌లో వైఎస్సార్‌సీపీకి చెందిన కడమంచి రామారావుతో పాటు సుమారు 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. గౌరు చరిత, వెంకటరెడ్డి దంపతులు, యువ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారికి గౌరు దంపతులు, గౌరు జనార్దన్ రెడ్డి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో చిన్న సుంకన్న, తాటికొండ మారన్న, బాదిగ మారెప్ప, పెద్ద సుంకన్న, హనుమంత్, ఎల్లప్ప, కడమంచి, ముగ్గ గోవింద్, శాంత రాజు, మహేష్, డొక్కా ఈరన్న, డొక్కా జమ్మయ్య, బాదిగ పెద్దూరు, కొండ్ర ఎల్లప్ప, ఆంపయ్య, ఎల్లమ్మ, మారెమ్మ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి, ప్రభాకర్ యాదవ్, రవి ప్రకాశ్ రెడ్డి, జంగాల సుంకన్న, అర్బన్ మహిళా నాయకురాలు రాములమ్మ, బుల్లెట్ సుంకన్న, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరు ఘటనపై బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలి

దాడులు, దౌర్జన్యాలతో ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారు
ఓటమి భయంతోనే హింసకు పాల్పడుతున్నారని గౌరు దంపతుల ఆరోపణ
రాష్ట్ర డీజీపీ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్



కర్నూలు, అక్టోబర్ 16: (మహి న్యూస్): పుంగనూరులో హింసకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితా రెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకట రెడ్డి డిమాండ్ చేశారు. కర్నూలులోని మాధవి నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా గౌరు దంపతులు మాట్లాడుతూ, గొడ్డలి పార్టీ నేతలు తమ నేర చరిత్రను నిరూపించుకుంటున్నారని విమర్శించారు. దౌర్జన్యాలు, దాడులు, అరాచకాలతో ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఓటమి భయంతోనే ఇలాంటి హింసాత్మక చర్యలకు దిగుతున్నారని అన్నారు. తాడేపల్లి నుంచి గొడ్డలి పార్టీ అధినేత ఆదేశాలతోనే పుంగనూరులో హింసకు పాల్పడ్డారని వారు ఆరోపించారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనల వల్ల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. పుంగనూరు ఘటనపై రాష్ట్ర డీజీపీ వెంటనే స్పందించి, హింసకు పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని గౌరు దంపతులు డిమాండ్ చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

స్ట్రాంగ్ రూమ్‌లు, పంపిణీ, స్వీకరణ, కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలి
జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి







కర్నూలు, అక్టోబర్ 16: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లు, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆదోనిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఎమ్మిగనూరు మండలం బానవాసి గ్రామంలోని జవహర్ నవోదయ విద్యాలయం, ఎమ్మిగనూరు పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలను జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ, సిబ్బంది రాకపోకలు, భద్రత, కౌంటింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, విధులు ముగించుకుని తిరిగి వచ్చే సిబ్బంది నుంచి సామగ్రి స్వీకరణ సజావుగా జరిగేలా అవసరమైన కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, ప్రవేశ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలను సూచించే బోర్డులు స్పష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల సిబ్బంది రవాణాకు వినియోగించే బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ముందస్తు రూట్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద రద్దీని నియంత్రించేందుకు బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్ల వద్ద ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పటిష్టమైన భద్రత కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రవేశ ద్వారాలు, కీలక ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, ముందస్తు తనిఖీలు నిర్వహించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో టేబుళ్లను క్రమబద్ధంగా ఏర్పాటు చేసి, ఓట్ల లెక్కింపు ప్రక్రియ స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థుల ఏజెంట్లకు నిబంధనల ప్రకారం సీటింగ్ ఏర్పాటు చేయాలని, వారి ప్రవేశానికి వేర్వేరు మార్గాలు సిద్ధం చేయాలని తెలిపారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి తరలింపునకు ప్రత్యేక మార్గం ఏర్పాటు చేసి, కౌంటింగ్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలన్నారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి తాగునీరు, మరుగుదొడ్లు, తగినంత గాలి, వెలుతురు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ నిర్దేశిత గడువులోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఆర్డీవో అరుణ దేవి, ఆదోని అడిషనల్ ఎస్పీ జయ శర్మ, ఆదోని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్, డీఎస్పీ శ్రీనివాసులు, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఎమ్మిగనూరు ఉప తహశీల్దార్ వీరేంద్ర గౌడ్, సంబంధిత ఎన్నికల అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల కేంద్రాల్లో మౌలిక వసతులు ముందుగానే పూర్తి చేయాలి

ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు, బారికేడింగ్ ఏర్పాటు చేయాలి
సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించాలి
జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్








కర్నూలు, అక్టోబర్ 16: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధుల నిర్వహణలో సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. శుక్రవారం గూడూరు మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణం ఇండోర్ భవనంలో ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. కేంద్రాలకు వచ్చే వాహనాల రాకపోకలు, పార్కింగ్‌కు స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద రద్దీ లేకుండా చర్యలు తీసుకోవాలని, కేంద్రానికి సుమారు 100 మీటర్ల దూరంలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్లు, తాగునీరు, మరుగుదొడ్లకు సంబంధించిన సూచిక బోర్డులను స్పష్టంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల నిర్వహణ, ఎన్నికల సామగ్రి పంపిణీ, తిరిగి స్వీకరణ ప్రక్రియ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా జరగాలని తెలిపారు. కౌంటింగ్ హాళ్లలో రిటర్నింగ్ అధికారి టేబుల్‌తో పాటు ఇతర టేబుళ్లను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేయాలని, వార్డు, టేబుల్ వారీగా సామగ్రిని గుర్తించేందుకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి భోజనం, అల్పాహారం, తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో పాటు అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కేంద్రాల లేఅవుట్ మ్యాప్‌తో సహా అన్ని ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఎన్నికల నిర్వహణలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి

ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన శాంతిభద్రతల చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో బారికేడింగ్ ఏర్పాటు చేసి వాహనాల రద్దీని నియంత్రించాలని, పార్కింగ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సిబ్బంది, అధికారులు, ఏజెంట్లకు నిబంధనల ప్రకారం ప్రత్యేక మార్గాలు కేటాయించాలని, అనధికార వ్యక్తులు కేంద్రాల్లోకి ప్రవేశించకుండా పర్యవేక్షణ చేపట్టాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లు, పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంచాలని, ఎన్నికల సామగ్రి భద్రతకు తగిన చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ముందస్తు భద్రతా ప్రణాళికను అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రియం వద, గూడూరు నగర పంచాయతీ కమిషనర్ ఏ.వి. రమేష్‌బాబు, తహశీల్దార్ వెంకటేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా హెల్ప్ డెస్క్‌ల ద్వారా సహకారం
కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నో డ్యూస్ సర్టిఫికెట్ల జారీలో జాప్యం వద్దు
ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలి
జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా







నంద్యాల, అక్టోబర్ 16: (మహి న్యూస్): నంద్యాల జిల్లాలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీతో కూడిన ఆరు పట్టణ స్థానిక సంస్థల్లో అక్టోబర్ 16 నుంచి 18వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోటీ చేసే అభ్యర్థులకు నామినేషన్ల దాఖలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించాలని అధికారులకు సూచించారు.

నామినేషన్ల దాఖలుపై పూర్తి సహకారం

నామినేషన్ పత్రాల భర్తీ, జతచేయాల్సిన ధ్రువపత్రాలు, డిపాజిట్ మొత్తం చెల్లింపు తదితర అంశాలపై అభ్యర్థులకు సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. నిబంధనల ప్రకారం పత్రాలను పూర్తి చేసి, అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత సమయంలో సమర్పించేలా అభ్యర్థులకు సహకరించాలని ఆదేశించారు.

ధ్రువపత్రాల జారీలో జాప్యం వద్దు

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నో డ్యూస్ సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరగకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ మేరకు తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్ణీత సమయంలో సేవలు అందించాలన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలి

ఎన్నికల నోటిఫికేషన్ జారీతో అమల్లోకి వచ్చిన ప్రవర్తనా నియమావళిని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, అధికారులు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల స్వీకరణ నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి దశను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ నామినేషన్ల స్వీకరణను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఎలాంటి పొరపాట్లు, నిర్లక్ష్యానికి తావులేకుండా ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001,KURNOOL DIST, A.P PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108
మహా న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

కల్లూరు అర్బన్‌లో టీడీపీలో చేరిన 50 కుటుంబాలు

గౌరు చరిత, వెంకటరెడ్డి దంపతులు, గౌరు జనార్దన్ రెడ్డి సమక్షంలో చేరికలు

పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన టీడీపీ నాయకులు



కర్నూలు, అక్టోబర్ 16: (మహి న్యూస్): కర్నూలు జిల్లా కల్లూరు అర్బన్ 45వ వార్డు శివప్ప నగర్‌లో వైఎస్సార్‌సీపీకి చెందిన కడమంచి రామారావుతో పాటు సుమారు 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. గౌరు చరిత, వెంకటరెడ్డి దంపతులు, యువ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారికి గౌరు దంపతులు, గౌరు జనార్దన్ రెడ్డి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో చిన్న సుంకన్న, తాటికొండ మారన్న, బాదిగ మారెప్ప, పెద్ద సుంకన్న, హనుమంత్, ఎల్లప్ప, కడమంచి, ముగ్గ గోవింద్, శాంత రాజు, మహేష్, డొక్కా ఈరన్న, డొక్కా జమ్మయ్య, బాదిగ పెద్దూరు, కొండ్ర ఎల్లప్ప, ఆంపయ్య, ఎల్లమ్మ, మారెమ్మ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి, ప్రభాకర్ యాదవ్, రవి ప్రకాశ్ రెడ్డి, జంగాల సుంకన్న, అర్బన్ మహిళా నాయకురాలు రాములమ్మ, బుల్లెట్ సుంకన్న, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యువజన ఉత్సవాలకు యువతకు అవకాశం

ఆన్‌లైన్ వ్యాసరచన పోటీల ద్వారా 200 మంది ఎంపిక

కడప జిల్లా । మహి న్యూస్ । అక్టోబర్ 16: యువతలో నూతన ఆవిష్కరణలు, నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర యువజన సేవల శాఖ, మై భారత్ సంయుక్త ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్--2027' కార్యక్రమానికి సంబంధించి మూడు దశల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.వి. ప్రసాదరావు తెలిపారు. మొదటి దశలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ఎంపిక పోటీల నుంచి 1,000 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. రెండో దశలో 'టెక్నాలజీ ఇన్నోవేషన్ -- ఫ్యూచర్ రెడీనెస్' అంశంపై 500 పదాలకు మించకుండా ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. అభ్యర్థులు తమ వ్యాసాలను ఈ నెల 22వ తేదీలోపు మై భారత్ పోర్టల్‌లో సమర్పించాలని సూచించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 200 మందిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత కల్పిస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన వారిని జనవరి 12, 2027న ఢిల్లీలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ యువజన ఉత్సవాలకు ప్రభుత్వ ఖర్చులతో పంపనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు: 9866852915, 8008819556 నంబర్లను కార్యాలయ వేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఓటర్ల జాబితా సవరణకు గడువు పొడిగింపు..!

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

అక్టోబర్ 22 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం..

30న తుది ఓటర్ల జాబితా విడుదల

కడప, మహి న్యూస్ అక్టోబర్ 16: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి అక్టోబర్ 22 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. 2026 జూలై 1వ తేదీని అర్హత తేదీగా పరిగణిస్తూ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం ఈ నెల 14న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారంతో పాటు నోటీసుల ప్రక్రియ కూడా అక్టోబర్ 22 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అక్టోబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఓటర్లు తమ పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలు ఓటర్ల జాబితాలో సక్రమంగా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్దిష్ట గడువులోగా సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, సవరించిన షెడ్యూల్‌ను రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మధ్యవర్తిత్వంతో వివాదాలకు సామరస్యపూర్వక పరిష్కారం

కడపలో మూడు ప్రాంతాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు

సమయం, ఖర్చు ఆదా చేసుకోవచ్చు..

ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలి



కడప, మహి న్యూస్, అక్టోబర్ 16: కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమస్యలను మధ్యవర్తిత్వం ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు శుక్రవారం బాలాజీనగర్, చిన్నకంపల్లె, నిర్మల ఫార్మసీ కళాశాల ప్రాంతాల్లో ప్రజలకు మధ్యవర్తిత్వంపై న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఇన్‌చార్జి కార్యదర్శి జి.సి. ఆసిఫా సుల్తానా సూచనల మేరకు మధ్యవర్తి












న్యాయవాదులు, న్యాయ సహాయ రక్షణ న్యాయవాదులు ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన మధ్యవర్తి న్యాయవాదులు మాట్లాడుతూ, మధ్యవర్తిత్వం ద్వారా ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకోవచ్చని వివరించారు. దీనివల్ల సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు కోర్టుల చుట్టూ తిరగాల్సిన ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. మధ్యవర్తిత్వ ప్రక్రియలో శిక్షణ పొందిన మధ్యవర్తులు ఇరుపక్షాల మధ్య చర్చలకు సహకరిస్తారని, ఎవరికీ అన్యాయం జరగకుండా పరస్పర అంగీకారంతో పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తారని పేర్కొన్నారు. చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా మార్చుకుండా, స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అర్హులైన వారు ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు పొందేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో న్యాయ సహాయ రక్షణ న్యాయవాదులు, న్యాయ సేవా స్వచ్ఛంద కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీపీఠం అన్నదానానికి పిల్లంక భక్తుల కూరగాయల వితరణ



తాళ్లరేవు, మహి న్యూస్, అక్టోబర్ 16: కాకినాడ శ్రీపీఠంలో శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీశక్తి యాగంలో భాగంగా ప్రతిరోజూ భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. నిత్యం సుమారు 20 వేల నుంచి 25 వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నారు. శనివారం అమ్మవారు సరస్వతీ దేవి స్వరూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా సుమారు 20 వేల మంది చిన్నారులతో సరస్వతీ పూజ నిర్వహించనున్నారు. అలాగే నిత్యం మహిళలచే లలితా సహస్రనామ పారాయణంతో పాటు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీపీఠంలో శనివారం నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి అవసరమైన కూరగాయలను పిల్లంక గ్రామానికి చెందిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి భక్తజనులు సమష్టిగా అందజేశారు. అదేవిధంగా శ్రీపీఠంలో కొలువైన ఐశ్వర్యాంబ అమ్మవారికి సుమారు అర కిలో యాలకులతో తయారుచేసిన ప్రత్యేక హారాన్ని సమర్పించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ అన్నదానానికి తమ వంతు సహకారం అందించిన పిల్లంక భక్తులను పలువురు అభినందించారు.

పుంగనూరు, తిరుపతి ఘటనలపై భూపేష్ రెడ్డి ఆగ్రహం

దాడులు, నామినేషన్ల అడ్డగింత ప్రజాస్వామ్యానికి విరుద్ధం బాధ్యులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి



కడప జిల్లా/ జమ్మలమడుగు మహి న్యూస్, అక్టోబర్ 16: పుంగనూరు, తిరుపతి ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, కూటమి అభ్యర్థుల నామినేషన్ల అడ్డగింత ఘటనలను కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ప్రక్రియను దాడులు, బెదిరింపులతో అడ్డుకోవాలని చూడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు. కడప నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకుడు దీపక్ రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో చోటుచేసుకున్న దౌర్జన్యాలను మళ్లీ కొనసాగించాలని ప్రయత్నించడం సరికాదన్నారు. అభ్యర్థులపై దాడులు చేయడం, నామినేషన్ పత్రాలను చించివేయడం వంటి చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు.

పుంగనూరు ఘటనపై విచారణ జరపాలి

పుంగనూరులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి తన అనుచరులతో కలిసి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడికి పాల్పడినట్లు, కారుతో ఢీకొట్టి నామినేషన్ల ప్రక్రియను అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చాయని భూపేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎంపీ ప్రమేయంపై వచ్చిన ఆరోపణలతో పాటు అన్ని అంశాలపై సమగ్ర విచారణ జరిపి, ఆధారాల మేరకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తిరుపతిలోనూ దాడుల ఆరోపణలు

తిరుపతిలోని కొర్లగుంట మారుతీనగర్‌లో కూటమి అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకున్న ఘటనను ఆయన ఖండించారు. కెనడీనగర్‌లో నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తున్న టీడీపీ కార్యకర్త యశోదపై భూమన అభినయ్, ఆయన అనుచరులు దాడి చేసి నామినేషన్ పత్రాలను చించివేసినట్లు వచ్చిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడినట్లుగా ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలోనూ అలాంటి చర్యలకు పాల్పడాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా పోటీ చేసి ప్రజల మద్దతుతో గెలవాలని, ప్రత్యర్థులపై దాడులు చేయడం, నామినేషన్లను అడ్డుకోవడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు జయసుబ్బారెడ్డి, నజీముద్దీన్, అధికార ప్రతినిధి మన్నూర్ అక్బర్, మీడియా సమన్వయకర్త జనార్దన్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ పాల్గొన్నారు.

కోరింగా ఫార్మసీ కళాశాలలో ఘనంగా దసరా సంబరాలు

సాంప్రదాయాలను కాపాడుకోవాలి: ప్రగళ్లపాటి కనకరాజు



తాళ్లరేవు, మహి న్యూస్, అక్టోబర్ 16: కోరింగా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో శుక్రవారం దసరా సంబరాలను సాంప్రదాయబద్ధంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్న ఈ వేడుకలను కళాశాల సెక్రటరీ ప్రగళ్లపాటి కనకరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో సందడి చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన దాండియా నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. కళాశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ప్రగళ్లపాటి కనకరాజు మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భావితరాలకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా కళాశాలలో సంక్రాంతి, దసరా సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పి. నాగమణి, జి. సీత, ప్రిన్సిపాల్ సువర్ణజ్యోతి, ఏఓ కె. మాల తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి గుడ్‌బై.. టీడీపీలోకి మాజీ సర్పంచ్ మట్ట రాంబాబు

ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు,

టీడీపీ జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి సమక్షంలో పార్టీలో చేరిక






ఐ పోలవరం, మహి న్యూస్, అక్టోబర్ 16: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి మరో రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. ముమ్మిడివరం మాజీ సర్పంచ్ మట్ట రాంబాబు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి సమక్షంలో ఆయన పసుపు కండువా కప్పుకుని టీడీపీలో చేరికను ప్రకటించారు. మట్ట రాంబాబు 2006 నుంచి 2011 వరకు ముమ్మిడివరం సర్పంచ్‌గా పనిచేశారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన ఆయనకు నియోజకవర్గంలో రాజకీయంగా మంచి పరిచయాలు ఉన్నాయని, స్థానిక ప్రజలతో సత్సంబంధాలు కలిగిన నాయకుడిగా గుర్తింపు ఉందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తుందనే నమ్మకంతోనే టీడీపీలో చేరినట్లు మట్ట రాంబాబు తెలిపారు. ఆయన చేరికతో ముమ్మిడివరం నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని టీడీపీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం

చిన్నారులచే ఉచిత సామూహిక సరస్వతి పూజ, అక్షరాభ్యాసాలు



కొత్తపేట అక్టోబర్ 16 (సంజీవిని న్యూస్): డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం నందు ఈరోజు అనగా అక్టోబర్ 16 శుక్రవారం నాడు ఉదయం 9 గంటలకు దసరా మహోత్సవములలో భాగంగా మూలా నక్షత్రం సందర్భంగాలి చిన్నారులచే ఉచిత సామూహిక సరస్వతి పూజ, అక్షరాభ్యాసాలు మరియు మహిళలచే సామూహిక కుంకుమ పూజలు దేవస్థానం అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిపించబడినది. అనంతరం పూజలో పాల్గొన్న చిన్నారులకు, మహిళలకు అన్నసమారాధన జరిగినది. పూజలో పాల్గొన్న విద్యార్థులకు దేవస్థానం వారు పలక, బలపం, పుస్తకం, పెన్ను మరియు మహిళలకు పూజా సామాగ్రి, పుస్తకం వితరణ చేయుట జరిగినది. ఈ కార్యక్రమంలో దేవస్థానం సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు, సహాయ ధర్మకర్తల మండలి సభ్యులు గంధం సత్య వెంకట నాగాజీ, దంగేటి సాయి నాగభూషణం, నేరేడుమిల్లి మహాలక్ష్మి ఏడుకొండలు, గవర వీర వెంకట సత్యనారాయణ, చిలకమర్తి అనంతలక్ష్మి సావిత్రి శ్రీనివాస్, తణుకు వీరభద్రరావు, కోటిపల్లి సుబ్బలక్ష్మి సుబ్రహ్మణ్యం, దేవస్థానం అర్చక మరియు ఎక్స్ అఫీషియో మెంబర్ అయలూరి శ్రీరామమూర్తి మరియు ఇతర గ్రామ పెద్దలు, దేవస్థానం అర్చకులు, వేద పండితులు, సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు స్వచ్ఛంద సేవకులు, పాల్గొన్నారు.





కనకదుర్గ ఆలయంలో ఘనంగా సామూహిక సరస్వతీ పూజలు



యానాం, మహి న్యూస్, అక్టోబర్ 16: యానాం శివారు కనకాలపేట గ్రామంలోని శ్రీ కనకదుర్గ దేవి ఆలయంలో 41వ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కోణంభట్ల శ్రీరామచంద్రమూర్తి, ఆయన తనయుడు సాయి సతీష్ శర్మ బ్రహ్మత్వంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హంసాని రామలక్ష్మణుడు, ఉత్తర శ్రీనివాస శ్రీలత కుమారి, భాను వెంకట స్వరూప్--దీప్తి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులతో సామూహిక సరస్వతీ దేవి పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు బహూకరించారు. విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కనకాల కృష్ణ, పోలిశెట్టి రామకృష్ణ, కనకాల సూరిబాబు, మల్లిపూడి గోవిందు, కనకాల సత్తిబాబు, గ్రామ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల భద్రతపై ఎస్పీ క్షేత్రస్థాయి పరిశీలన


నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల తనిఖీ


సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతిభద్రతలపై సమీక్ష

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి



కర్నూలు, అక్టోబర్ 16: (మహి న్యూస్): ఎన్నికల భద్రతా ఏర్పాట్లలో భాగంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ శుక్రవారం ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని పలు కీలక ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, పోలీసు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముందుగా ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం బనవాసి సమీపంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మిగనూరు పట్టణంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంతో పాటు వెంకటాపురం, ఆది ఆంధ్ర పాఠశాలలను పరిశీలించారు. ఎమ్మిగనూరు గ్రామీణ పరిధిలోని కడిమెట్ల, ఎర్రకోట వంటి సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలను సందర్శించి శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు.





అనంతరం ఎమ్మిగనూరు డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణ, సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ప్రణాళికను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సీఐ చిరంజీవి, టౌన్ సీఐ కంబగిరి రాముడు, టౌన్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, నందవరం ఎస్ఐ తిమ్మారెడ్డి పాల్గొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం, కర్నూలు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P
PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com